Follow: @ANNTELUGU

05-09-2026

ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 238 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



పట్టపగలే..

## చిమ్మచీకటి

### ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం

- జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్
- విమాన సేవలకు తీవ్ర అంతరాయం, 400కు పైగా ఫ్లైట్స్ ఆలస్యం
- 9 విమానాలను జైపూర్, లక్నో, అహ్మదాబాద్‌కు దారి మళ్లింపు
- ఢిల్లీకి రెడ్ అలర్ట్ ప్రకటించిన భారత వాతావరణ శాఖ

**న్యూఢిల్లీ, మహా :** దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

### దమ్ముంటే హరీశ్ రావు భార్య నాపై పోటీ చేయాలి



- బీఆర్ఎస్ నేతల సవాల్ పై కవిత కౌంటర్
- నాపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు రెడీ
- నేను సీఎం కావాలని కోరుకుంటున్నా

03


### కొండా సురేఖను బీఆర్ఎస్ పార్టీలోకి తీసుకోం



- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు మళ్లీ అవకాశం లేదని వెల్లడి
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

02

### కౌశిక్‌రెడ్డికి ఎథిక్స్ కమిటీ షాక్



- నేడు రాతపూర్వక సమాధానం కోరిన కమిటీ
- కౌశిక్‌రెడ్డి సమాధానంపై ఉత్కంఠ
- అసెంబ్లీ నుండి వేటుకు రంగం సిద్ధం

02

# కొడంగల్‌కు కొత్తరూపు



### సీఎం రేవంత్ ప్రగతి సంతకం

సొంత నియోజకవర్గంలో రెండురోజులు

నేడు కూడా.. అక్కడే

ఎడ్యుకేషన్ హబ్.. ఆస్పత్రి, రహదారులు, సంక్షేమ పనులపై సమీక్ష

**కొడంగల్, మహా**

కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. తన రాజకీయ ప్రస్థానానికి పునాది అయిన కొడంగల్ గడ్డపై ప్రత్యేక ముద్ర వేసేందుకు ఆయన అమలు చేస్తున్న మాస్టర్ ప్లాన్ , అభివృద్ధి కొడంగల్ ప్రగతిపై సరికొత్త ఆశలు కల్పించాయి. కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతోపాటు సీఎం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. తరచూ నియోజకవర్గంలో పర్యటిస్తూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి శ్రమిస్తున్నారు. రెండురోజుల పర్యటనకు కొడంగల్ చేరుకున్న సీఎం.. మరోసారి కొడంగల్ కు కొత్తరూపునిచ్చే పనులను స్వయంగా పరిశీలించారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్దూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు. అదే స్థలంలో

మిగతా 2వ పేజీలో

మీరాలం కుంట చెరువులో కొనసాగుతున్న అక్రమ నిర్మాణం



జోనల్ కమిషనర్ రాధిక గుప్తా

డిప్యూటీ కమిషనర్ వాణి

ఘట్కేసర్ సర్కిల్‌లో

# ఆగని అక్రమ నిర్మాణాలు...!

పార్కు స్థలాలు, చెరువుల్లో యదేచ్ఛగా నిర్మాణాలు ..!

అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతున్న వైనం...!

జోడిమెట్లలో అక్రమ షెడ్డు నిర్మాణానికి అధికారుల అండ ...!

- ఘట్‌కేసర్ సర్కిల్‌లో పత్తాలేని టౌన్ ప్లానింగ్ అధికారులు ...!
- డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం ...!
- జోడిమెట్ల అక్రమ షెడ్డు నిర్మాణంలో ఎవరి వాటా ఎంత...!
- జోనల్ కమిషనర్‌ను తప్పదోవ పట్టిస్తున్న డిప్యూటీ కమిషనర్ వాణి ..!

**మహా, సిటీ బ్యూరో :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్, పోచారం వార్డు జోడిమెట్లలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్‌వరంగల్ ప్రధాన రహదారిపై తాజా కిచెన్ పక్కన ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఆనుకుని కొనసాగుతున్న అక్రమ షెడ్డు నిర్మాణంతో పాటు, పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై స్థానికులు

మిగతా 2వ పేజీలో






## గంజాయి కొట్టి విమానం నడిపిన పైలట్

### ఎయిరిండియా ఫ్లైట్ ప్రమాదంపై కీలక నివేదిక

**ఢిల్లీ, మహా :** ఎయిర్ ఇండియా ఫుకెట్ ఢిల్లీ విమాన ఘటనలో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. విమానాన్ని నడిపిన పైలట్లలో ఒకరు మాదకద్రవ్యాలు వాడినట్లు పరీక్షల్లో తేలింది. ఈ విషయాన్ని విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) తీవ్రంగా పరిగణించింది. విమాన సిబ్బందిలో మత్తు పదార్థాల వినియోగాన్ని అడ్డుకునేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తగిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. ఆగస్టు 4న ఫుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ 2379లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎయిర్‌బస్ ఏ320251ఎన్ విమానంలో ఇద్దరు పైలట్లు, ఆరుగురు క్యాబిన్ సిబ్బందితో కలిపి మొత్తం 145 మంది ప్రయాణిస్తున్నారు. ఢిల్లీకి వెళ్తున్న సమయంలో విమానం ఒక్కసారిగా 300 అడుగుల కిందకు పడిపోయింది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. విమానం ఢిల్లీ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత గాయపడిన వారికి వైద్య సహాయం అందించారు. ఏఏఐబీ

మిగతా 3వ పేజీలో



## ఎమ్మెల్యే పదవికి కొండా రాజీనామా చేయాలి

### ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య డిమాండ్

**వరంగల్, మహా :** దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీమా చేయాలి. రాజీనామా చేసి కొండా సురేఖ ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలి. నేను కూడా ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా. ఇంకెన్నాళ్లు బీసీ కార్డు వాడుకుంటారు అంటూ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాజీ మంత్రి కొండాసురేఖపై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. "ఇన్ని సంవత్సరాలు ప్రజల రక్తం తాగిన మీరు ఇప్పుడు బీసీ కార్డును ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. ఇంకా ఎన్నాళ్లు బీసీ కార్డును వాడుకుంటారు?" అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తిడితే తాను ఊరుకోబోనని హెచ్చరించారు. కొండా సురేఖపై హైకమాండ్‌కు ఫిర్యాదు చేసింది తానేనని వెల్లడించారు. "బ్లాక్‌మెయిల్ కల్చర్ మీదే " అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు.



## గత ప్రభుత్వ వైఫల్యంతోనే పోలవరం ముప్పు

### విలేఖరుల సమావేశంలో మంత్రి పొంగులేటి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** గతంలో పదేళ్ళు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యంతోనే.. మనకు పోలవరం ముప్పు పొంచి ఉందని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం భద్రాచలంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో దేవస్థాన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి అనంతరం ఏర్పాటు చేసిన

మిగతా 2వ పేజీలో

## ఆంధ్రా పేపర్స్‌పై పవన్ ఫైర్

పన్నుల బకాయిలు, కాలుష్యంపై కొరడా!



- 2016 తర్వాత ఒక్క రూపాయి పన్ను చెల్లించలేదా?
- రూ.21.34 కోట్ల బకాయిలపై ఆగ్రహం.
- పన్నులు ఎగ్గొడుతూ కాలుష్యం సృష్టిస్తే సహించం.
- బాధ్యతారాహిత్యంపై కఠిన చర్యలు.
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

03

## క్రికెట్ ఫ్యాన్స్‌కు పండగ

- మెగా ఈవెంట్స్ అన్నీ మన గడ్డమీదే !
- ఏడాది ఆరంభం నుంచే క్రికెట్ కిక్కు
- ఒకటి ముగిసేలోపే మరోటి
- అభిమానులకు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్

03



# కౌశిక్‌రెడ్డికి ఎథిక్స్ కమిటీ షాక్

- నేడు రాతపూర్వక సమాధానం కోరిన కమిటీ
- కౌశిక్‌రెడ్డి సమాధానంపై ఉత్కంఠ
- అసెంబ్లీ నుండి వేటుకు రంగం సిద్ధం



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి తెలంగాణ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ తాజాగా నోటీసులు జారీ చేసింది. మార్చి 29న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆయన వ్యవహరించిన తీరుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి శనివారం సాయంత్రం లోగా రాతపూర్వక వివరణ ఇవ్వాలని కమిటీ ఆదేశించింది. కౌశిక్‌రెడ్డి ఇచ్చే సమాధానం ఆధారంగా తదుపరి చర్యలపై కమిటీ నిర్ణయం తీసుకునే అవకాశం ఉండటంతో ఈ వ్యవహారం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కౌశిక్ రెడ్డిపై కఠినచర్య తీసుకోవాలని, అసెంబ్లీ సమావేశాలు ప్రారంభానికి ముందే చర్య తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. గతంలో కోమటిరెడ్డి, సంపత్ కుమార్ ల తరహాలో చర్య తీసుకుంటారా.. లేదంటే ఈ టర్మ్ అంతా అసెంబ్లీ రాకుండా సస్పెండ్ చేస్తారా? అన్నది చూడాల్సి ఉంది. చర్యలు మాత్రం పక్కాగా కనబడుతున్నాయి.

**మార్చి 29న అసెంబ్లీలో ఏం జరిగింది?**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి మధ్య చోటుచేసుకున్న వివాదం ఎథిక్స్ కమిటీ దృష్టికి వెళ్లింది. కడియం శ్రీహరిపై కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు, సభలో ఆయన వ్యవహరించిన తీరుపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ అంశంపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు కూడా అప్పట్లో తెరపైకి వచ్చాయి. అనంతరం ఈ వ్యవహారాన్ని అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ పరిశీలనకు అప్పగించింది. ఈ వివాదంపై ఎథిక్స్ కమిటీ చైర్మన్ రేపూరి ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన ఆగస్టు 29న అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశం జరిగింది. దాదాపు రెండు గంటలపాటు జరిగిన సమావేశంలో కౌశిక్‌రెడ్డి వ్యవహారంపై సమగ్రంగా చర్చించినట్లు సమాచారం. కౌశిక్‌రెడ్డిని పిలిచి వివరణ తీసుకోవాలని కమిటీ నిర్ణయించినట్లు అప్పట్లో వెల్లడైంది. కమిటీ విచారణకు ముందు నుంచే ఈ వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. కౌశిక్‌రెడ్డిపై మాత్రమే చర్యలు తీసుకోవడం సరికాదని బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలు, ప్రవర్తనపైనా ఎథిక్స్ కమిటీ విచారణ జరపాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది.

**బీఆర్ఎస్ ఎదురుదాడి వ్యూహం**

ఎథిక్స్ కమిటీ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి.. కౌశిక్‌రెడ్డి ఎలాంటి తప్పు చేయలేదని వాదించినట్లు సమాచారం. అదే సమయంలో ఇతర పార్టీల సభ్యులు మాత్రం ఆరోపణలకు ఆధారాలు ఉంటే వాటిని పరిశీలించి, తప్పు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తాజా కథనాలు వెల్లడించాయి. దీంతో కౌశిక్‌రెడ్డి ఇప్పుడు ఇచ్చే రాతపూర్వక సమాధానం కీలకంగా మారింది.



# కొడంగల్‌కు కొత్తరూపు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందుకొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

**హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనులపై ఆరా**

దౌలతాబాద్ మండలం గోకఫసల్వాడ్ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం వెళ్లారు. ఒక్కో ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. యంగ్ ఇండియా స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్ స్కూల్ ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద కలియ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

**అధికారులకు దిశానిర్దేశం**

430 పడకల ఆస్పత్రి పనులపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో పనులు చేయించాలని నాణ్యత, సాంకేతిక అంశాలు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని ల్యాండ్ స్కేపింగ్ పనులకు వాడాలని సీఎం సూచించారు. అనంతరం కొండగల్ నియోజవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో పర్యటనల అనంతరం రోడ్డు మార్గాన కొడంగల్ నివాసానికి చేరుకున్న సీఎం రాత్రికి అక్కడే బస చేశారు. శనివారం



కొడంగల్‌లో ప్రభుత్వాసుపత్రి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**వేగంగా ప్రగతి**

కొడంగల్ అభివృద్ధిని వేగవంతం చేయడానికి ప్రత్యేకంగా కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి, భారీగా నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి సాగునీటి సమస్య తీర్చేందుకు అపరభగీరధుడిగా మారారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టి, కృష్ణా జలాలను కొడంగల్ ఎత్తిపోతల ద్వారా పొలాలకు అందించే పనులను వేగవంతం చేశారు. కొడంగల్‌లో వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు సుమారు రూ. 250 కోట్ల వ్యయంతో 430 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి పునాదిరాయి వేసి పనులను వేగవంతం చేశారు. అలాగే విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు మరియు ఎడ్యుకేషన్ హబ్‌ల నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో సుమారు 2,300 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పారిశ్రామిక వాడలు, ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇంకా మరెన్నో రకాల పనులు జోరుగా సాగుతున్నాయి.



# ఘట్కేసర్ సర్కిల్‌లో ఆగని అక్రమ నిర్మాణాలు...!



జోడిమెట్లలో హెచ్ పి పెట్రోల్ బంక్ పక్కన టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లో కొనసాగుతున్న అక్రమ షెడ్డు

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదులు చేస్తున్నా నిర్మాణ పనులు మాత్రం ఆగడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు అందినప్పుడల్లా పనులు నిలిపివేసినట్లు హడావుడి చేసి, అధికారులు వెళ్లిపోయిన వెంటనే తిరిగి యథావిధిగా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. దీంతో 'నువ్వు కొట్టినట్లు చేయి.. నేను ఏడ్చినట్లు నటిస్తా' అన్న చందంగా అధికారుల తీరు మారిందని వారు విమర్శిస్తున్నారు.

**పరదాల మాటున అక్రమ షెడ్డు నిర్మాణం..!**

జోడిమెట్లలో అక్రమ షెడ్డు నిర్మాణాలు కొనసాగుతున్నాయని పలువురు స్థానిక మీడియా ప్రతినిధులు డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ విషయం తెలుసుకున్న సంబంధిత షెడ్డుకు చెందిన సూపర్‌వైజర్ హుటాహుటిన అక్కడికి చేరుకుని బయట నుంచి నిర్మాణం కనిపించకుండా పరదాలు కప్పించారని స్థానికులు చెబుతున్నారు. అయితే పరదాల మాటున మాత్రం నిర్మాణ పనులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు అందుతున్నా కనీసం నోటీసులు జారీ చేయకపోవడం, నిర్మాణాన్ని నిలిపివేసే చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని వారు వాపోతున్నారు.

సెలవు రోజులు, వారాంతాల్లో పనులు చేసుకోవాలని కొందరు మున్సిపల్ సిబ్బందే సూచిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ అక్రమ షెడ్డు నిర్మాణం వెనుక ఎవరి అండదండలు ఉన్నాయి..? మున్సిపల్ అధికారులకు అందిన ముడుపులలో ఎవరి వాటా ఎంత..? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**తాజా కిచెన్ పక్కన పత్రికా కథనాలతో కూల్చిన షెడ్డు.. మళ్లీ అదే పరిస్థితి..!**

"ఇటీవల జోడిమెట్లలోని తాజా కిచెన్ పక్కన నిర్మించిన అక్రమ షెడ్డు విషయంలో భారీగా ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు వినిపించాయి. పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకుల ఒత్తిళ్లతో అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారనే విమర్శలు వచ్చాయి. అనంతరం వివిధ పత్రికల్లో వరుస కథనాలు వెలువడటంతో పాటు స్థానికుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో తప్పని పరిస్థితుల్లో ఆ అక్రమ నిర్మాణాన్ని అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో కొనసాగుతున్న అక్రమ షెడ్డు నిర్మాణం విషయంలోనూ అదే పరిస్థితులు పునరావృతమవుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు, ఫొటోలు, ఆధారాలు అందజేసినా అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని వారు పేర్కొంటున్నారు.



ఎం జె ఆర్ ఎదురుగా కోర్ట్ ఆర్డర్ దిక్కరించి బహుళ అంతస్థుల అక్రమ నిర్మాణం..

ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్ వెంటనే స్పందించి అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డును స్వాధీనం చేసుకుని (సీజ్ చేసి) బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ఎంజేఆర్ ఎదురుగా మరో అక్రమ నిర్మాణం..!**

ఇదిలా ఉండగా నారపల్లి నుండి జోడిమెట్ల వెళ్లే ప్రధాన రహదారి ఎంజేఆర్ ఎదురుగా మరో అక్రమ నిర్మాణం వ్యవహారం వివాదాస్పదంగా మారింది. జి + 1 అంతస్తులకు మాత్రమే అనుమతి తీసుకున్న నిర్మాణదారులు అదనంగా మరో అంతస్తు, పెంట్‌హౌస్ నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ నిర్మాణాన్ని జోనల్ కమిషనర్ అధికారులు గతంలో సీజ్ చేసినప్పటికీ, అనంతరం కోర్టు ఉత్తర్వులను ఆసరాగా చేసుకుని భవన యజమానులు మొత్తం భవనాన్ని తెరిచి వినియోగంలోకి తీసుకువచ్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కోర్టు ఉత్తర్వుల ప్రకారం జి +1 అంతస్తుల వరకు మాత్రమే నిర్మాణ పనులు చేపట్టాలని స్పష్టంగా ఉన్నప్పటికీ, నిర్మాణదారులు అదనపు అంతస్తులు, పెంట్‌హౌస్‌తో సహా మొత్తం భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభించారని స్థానికులు వాపోతున్నారు. ఇది కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన, న్యాయస్థాన ధిక్కరణ (కోర్టు ధిక్కరణ) కిందకు రాదా అని ప్రశ్నిస్తున్నారు.

అధికారులు సీజ్ చేసిన భవనాన్ని మళ్లీ ఎలా తెరిచారు..? అదనపు అంతస్తులు, పెంట్‌హౌస్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదు..? కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా భవనాన్ని వినియోగిస్తున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారని స్థానికులు నిలదీస్తున్నారు. ఈ వ్యవహారంలో కొందరు అధికారుల అండదండలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, టౌన్ ప్లానింగ్ అధికారులు ఘట్కేసర్ సర్కిల్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు, అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తుల భవనాలపై ప్రత్యేక విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## జోనల్ కమిషనర్‌ను తప్పుదోవ పట్టిస్తున్న డిప్యూటీ కమిషనర్ వాణి ..!

ఘట్కేసర్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల విషయంలో జోనల్ కమిషనర్ (జెడ్‌సీ) రాధికా గుప్తాను డిప్యూటీ కమిషనర్ (డీసీ) వాణి తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై జెడ్‌సీకి పూర్తి సమాచారం చేరకుండా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు జోడిమెట్లలో తాజా కిచెన్ పక్కన ఇటీవల కూల్చివేసిన అక్రమ షెడ్డు వ్యవహారమే నిదర్శనమని స్థానికులు పేర్కొంటున్నారు. తాజా కిచెన్ పక్కన కొనసాగుతున్న అక్రమ షెడ్డు నిర్మాణంపై స్థానికులు నేరుగా జెడ్‌సీ రాధికకు ఫిర్యాదు చేయడంతో ఆమె వెంటనే స్పందించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. స్థానిక మున్సిపల్ సిబ్బందికి సైతం ముందస్తు సమాచారం ఇవ్వకుండా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దింపి అక్రమ షెడ్డు కూల్చివేతలు చేపట్టడం గమనార్హం. ఫిర్యాదు అందిన వెంటనే జెడ్‌సీ స్పందించి చర్యలకు ఆదేశించడంతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాల్సి వచ్చింది. అయితే, ఇంతటి కీలకమైన అక్రమ నిర్మాణంపై జెడ్‌సీకి ముందుగానే సమాచారం ఎందుకు ఇవ్వలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. డిప్యూటీ కమిషనర్ స్థాయిలోనే అక్రమ నిర్మాణాలపై సమాచారాన్ని దాచిపెడుతున్నారా? ఫిర్యాదులు వచ్చినా జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లకుండా వ్యవహరిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జెడ్‌సీకి వాస్తవ పరిస్థితులు తెలియకుండా చేయడం వల్లే పలు అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజా కిచెన్ అక్రమ షెడ్డు విషయంలో జెడ్‌సీకి నేరుగా ఫిర్యాదు చేయడంతో వెంటనే చర్యలు జరగడం, ఇతర నిర్మాణాలపై ఫిర్యాదులు ఉన్నప్పటికీ చర్యలు లేకపోవడాన్ని స్థానికులు ఉదాహరణగా చూపుతున్నారు. ఇకనైనా జెడ్‌సీ క్షేత్రస్థాయి వాస్తవాలను నేరుగా తెలుసుకుని, అక్రమ నిర్మాణాలపై వస్తున్న ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మీరాలం కుంట చెరువు ఎఫ్ టి ఎల్ పరిధిలో...

**అన్నోజిగూడలో పార్కు స్థలానికీ ఎసరు..!**

అక్రమ నిర్మాణాల వ్యవహారం జోడిమెట్లకే పరిమితం కాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అన్నోజిగూడలోని సత్యసాయి హౌసింగ్ కాలనీలో సర్వే నంబర్లు 18, 19, 44 పరిధిలో కమ్యూనిటీ హాల్ సమీపంలోని సుమారు 300 గజాల పార్కు స్థలంలో మళ్లీ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు వారు చెబుతున్నారు.

గతంలో పోచారం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన వీరారెడ్డి ఈ నిర్మాణాలను అక్రమ నిర్మాణాలుగా గుర్తించి పనులను నిలిపివేశారని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పుడు మళ్ళీ యథేచ్ఛగా నిర్మాణ పనులు కొనసాగుతుండటం జి + 2 అంతస్థులు పూర్తి కావడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పుడు అక్రమమని నిలిపివేసిన నిర్మాణం.. ఇప్పుడు సక్రమంగా ఎలా మారిందని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. పార్కు స్థలం కాలనీవాసుల ప్రజా అవసరాల కోసం కేటాయించబడినదైతే దానిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో నిలిపివేసిన అక్రమ నిర్మాణాలకు ఇప్పుడు గ్రీన్ సిగ్నల్ ఎలా వచ్చింది ? అనుమతులు ఉంటే వాటి ఆధారాలు ఏమిటి? లేకుంటే నిర్మాణ పనులు తిరిగి ఎలా ప్రారంభమయ్యాయి? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పార్క్ స్థలానికి సంబంధించిన రికార్డులు, లేఅవుట్ వివరాలు, నిర్మాణ అనుమతులను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని, పార్కు స్థలాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

**మీరాలం కుంట చెరువులోనూ అక్రమ నిర్మాణాలు ..!**

మీరాలం కుంట చెరువు పరిధిలో అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు ఎఫ్ టి ఎల్ లో ఎలాంటి నిర్మాణాలకు తావులేకపోయినా నిబంధనలను పట్టించుకోకుండా పనులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని వారు పేర్కొంటున్నారు . చెరువు ఎఫ్ టి ఎల్ లో నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు అడ్డుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటలు, నీటి వనరులను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ.. మీరాలం కుంటలో అక్రమ నిర్మాణాలు కొనసాగడం అధికారుల పర్యవేక్షణ తీరుపై అనుమానాలకు తావిస్తోంది. చెరువు స్థలంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఘట్‌కేసర్ పరిధిలోని చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను గుర్తించి, వాటిని తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# గత ప్రభుత్వ వైఫల్యంతోనే పోలవరం ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి నిర్లక్ష్య వైఖరితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు మండలాలను, భద్రాచలం చుట్టుపక్కల ఐదు గ్రామపంచాయతీలను ఆంధ్రాలో విలీనం చేయడం బాధాకరమని అన్నారు. ఎల్ నినో ప్రభావంతో ప్రస్తుతం వరదలు లేకున్నా భవిష్యత్ లో భద్రాచలం నుంచి ములుగు వరకు సాధారణం కంటే 2025 అడుగుల వరకు అధికంగా బ్యాక్ వాటర్ ఉధృతి పెరిగే అవకాశం ఉందని తెలిపారు. గతంలో సిడబ్ల్యూసి, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలకు గోదావరి పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని తెలిపారు. పోలవరానికి తాము వ్యతిరేకం కాదని తెలంగాణలో ముంపు ప్రాంతాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. పార్లమెంట్ సమావేశాల నాటికి తెలంగాణ ఎంపీలు, గోదావరి పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి పోలవరం ప్రభావంతో జరిగే వరద ముప్పు తీవ్రతను వివరించి పునః పరిశీలించాలని కోరతామని ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐటీడీఏ పీవో రాహుల్ పాల్గొన్నారు.

## కొండా సురేఖను బీఆర్ఎస్ పార్టీలోకి తీసుకోం

**మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

**హైదరాబాద్, మహా :** కొండా సురేఖను బీఆర్ఎస్ పార్టీలోకి తీసుకోమని ఆ పార్టీ నేత జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లోకి చాలా మంది నేతలను తీసుకునేది లేదని ఇప్పటికే చెప్పామన్నారు. శుక్రవారం మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో పార్టీ మారిన 9 మంది ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరిని తప్ప ఎవరినీ తీసుకోబోమని తేల్చిచెప్పారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో కొందరు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని జగదీశ్‌రెడ్డి తెలిపారు.

## 30 పశువులు స్వాధీనం.. ఏడుగురు అరెస్టు

**మందమర్రి, మహా:** మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా పశువులను తరలిస్తున్న మూడు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. మూడు మహీంద్రా క్యాంపర్ వాహనాల్లో తరలిస్తున్న 13 ఆవులు, 17 దూడలు కలిపి 30 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు. కౌటాల నుంచి జగిత్యాల జిల్లా రాజారాంపల్లి పశువుల అంగడికి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనలో ముగ్గురు డ్రైవర్లు, నలుగురు సహాయకులను అరెస్టు చేశారు. వారి నుంచి మూడు వాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.



## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో అక్రమాల లీలలు..!

**మృతులు, ఉద్యోగులకూ ఇళ్లు.!**


**మందమర్రి, మహా :** నిరుపేదల చిరకాల స్వప్నమైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియలో తీవ్రమైన అవకతవకలు వెలుగుచూశాయి. పారదర్శకంగా ఇళ్లు పంపిణీ చేస్తామని పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. గత నెలలో మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన లక్కీ డ్రా ఎంపిక ప్రక్రియ స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఎంపికలో మృతి చెందిన వారికి, వివాహం కాని వారికి, సింగరేణి ఉద్యోగులకు, నెలకు 25 వేల రూపాయలు పెన్షన్ వచ్చే మాజీ కార్మికులకు, రేషన్ కార్డు లేనివారు లబ్ధిదారుల జాబితాలో ఉండడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరిగిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**మృతి చెందిన వారికి కేటాయింపు**

గత సంవత్సరం క్రితం ఎప్పుడో మృతి చెందిన వ్యక్తుల పేరిట లక్కీ డ్రాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు కావడం అధికారుల సర్వేలోని లోపాలను ఎత్తిచూపుతోంది. లబ్ధిదారులుగా ఎంపికైన వారిని రెవెన్యూ అధికారులు విచారణ కూడా చేపట్టారు. ఇందులో వివాహం కాని యువకుల పేర్లు కూడా లబ్ధిదారుల జాబితాలో ఉండటం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులు, వివాహమై అత్తవారింటికి శాశ్వతంగా వెళ్లిపోయిన మహిళల పేరిట కూడా లక్కీ డ్రా లో ఇళ్లు కేటాయించడం గమనార్హం.

**లక్షల్లో వసూళ్లు...!?**

అధికార పార్టీకి చెందిన కొంతమంది స్థానిక నేతలు ఒక్కో ఇంటికి లక్ష రూపాయలకు పైగా వసూలు చేసి, అనర్హులను అక్రమంగా జాబితాలో చేర్చారనే ఆరోపణలు పట్టణంలో బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అర్హులైన నిరుపేదలకు దక్కాల్సిన ఇళ్లు ఇలా అన్యాక్రాంతం కావడంపై లబ్ధిదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ పథకం కొందరి స్వార్థం వల్ల నీరుగారిపోతోందని వాపోతున్నారు. ప్రజాప్రతినిధుల వల్లనే ఇటువంటి అక్రమాలు జరుగుతుండటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా చెన్నూరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, సమగ్ర విచారణ జరిపి అనర్హుల పేర్లను తొలగించి, నిజమైన నిరుపేదలకు న్యాయం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# అప్పుడు సంతోషించా కానీ.. ఇప్పుడు బాధేస్తోంది

- కొండా సురేఖ బర్తరఫ్‌పై బీజేపీ ఎంపీ డీకే అరుణ కామెంట్స్
- సురేఖను బీజేపీలోకి ఆహ్వానించే అంశం చర్చించలేదన్న ఎంపీ



**జడ్చర్ల, మహా :** కొండా సురేఖ బర్తరఫ్‌పై బీజేపీ ఎంపీ డీకే అరుణ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తనను తీవ్రంగా బాధించిందని పేర్కొన్నారు. గతంలో తామిద్దరం మంత్రులుగా కలిసి పనిచేశామని గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలే కొండా సురేఖను తొలగించడానికి కారణమని ఆరోపించారు. బీసీ మహిళను తొలగించడం ద్వారా కాంగ్రెస్‌కు బీసీలపై ఉన్న గౌరవం బయటపడిందని విమర్శించారు. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్, బీజేపీ నేతలు రేవంత్ రెడ్డి సర్కార్‌పై మండిపడుతుండగా.. తాజాగా బీజేపీ ఎంపీ డీకే అరుణ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. శుక్రవారం జడ్చర్ల, బాలానగర్ మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న డీకే అరుణ మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ తనకు సీనియర్ మహిళా నాయకురాలు అని.. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో తాము ఇద్దరం కలిసి మంత్రులుగా పనిచేశామని ఆమె గుర్తుచేసుకున్నారు. తోటి మహిళా నాయకురాలు మంత్రిగా తెలంగాణకు సేవలందించడం చూసి అప్పుడు సంతోషించానని.. కానీ ఇప్పుడు అదే నాయకురాలిని మంత్రివర్గం నుంచి తొలగించడం తనకు తీవ్రంగా బాధను కలిగిస్తోందని డీకే అరుణ వ్యాఖ్యానించారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు కొండా సురేఖను బాధ్యురాలిని చేస్తూ మంత్రివర్గం నుంచి తొలగించడం సమర్థనీయం కాదని డీకే అరుణ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒక మహిళ రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఈ స్థాయికి రావడం సాధారణ విషయం కాదని పేర్కొన్నారు. అలాంటి సీనియర్ మహిళా నాయకురాలిపై తీసుకున్న చర్య సరైన నిర్ణయం కాదని మండిపడ్డారు. బీసీల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఎంతో చేస్తున్నామని చెబుతున్నారని విమర్శించిన డీకే అరుణ.. అయితే ఓ బీసీ మహిళా మంత్రిని కేబినెట్ నుంచి తొలగించడం ద్వారా బీసీలపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న గౌరవం ఏమిటో అర్థమవుతోందన్నారు. అయితే కొండా సురేఖను బీజేపీలోకి ఆహ్వానించే అంశంపై ఇప్పటివరకు తమ మధ్య ఎలాంటి చర్చ జరగలేదని డీకే అరుణ స్పష్టం చేశారు. దీంతో సురేఖ భవిష్యత్ రాజకీయ అడుగులపై కొనసాగుతున్న ఊహాగానాలకు ఆమె వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవు

- శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయి
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు బీజేపీ మహిళా మోర్చా వినతిపత్రం



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు భద్రత పూర్తిగా గాలిలో దీపంగా మారిందని, శాంతి భద్రతలు తీవ్రంగా క్షీణించాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకూ పెరిగిపోతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు, దాడులను నిరసిస్తూ శుక్రవారం రాజ్ భవన్‌లో గౌరవ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. గవర్నర్ ను కలిసిన అనంతరం డాక్టర్ మేకల శిల్పారెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఆగస్టు 28న తుక్కుగూడలోని ప్రైమ్‌కేర్ ఆసుపత్రిలో నర్సుగా సేవలందిస్తున్న గిరిజన యువతిపై మహమ్మద్ సనావుల్లా ఖాన్ అనే దుర్మార్గుడు అత్యంత పాశవికంగా అత్యాచారం చేసి, హత్య చేసిన ఘోర ఉదంతాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తండ్రి లేని నిరుపేద కుటుంబంలో ఆ అమ్మాయి సంపాదనే ఏకైక ఆధారంగా బతుకుతున్న కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, బాధితురాలి తల్లికి గానీ, సోదరుడికి గానీ ప్రభుత్వ ఉద్యోగం కల్పించి పూర్తిస్థాయిలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడైన మహమ్మద్ సనావుల్లా ఖాన్‌కు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వెంటనే ఉరిశిక్ష పడేలా చర్యలు చేపట్టాలని కోరారు.నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి ఇంట్లో లేని సమయం చూసి.. స్థానిక కాంగ్రెస్ మేయర్, ఆయన అనుచరులు రౌడీ మూకలతో కలిసి వారి ఇంట్లో చొరబడి దాష్టీకానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు, వృద్ధురాలైన వర్షిత్ రెడ్డి తల్లిపై భౌతిక దాడికి దిగడం అత్యంత హేయమైన చర్య అన్నారు. దాడికి సంబంధించిన స్పష్టమైన సీసీటీవీ ఆధారాలు ఉన్నప్పటికీ, స్వయంగా బాధితురాలు ఫిర్యాదు చేసినా అధికార పార్టీకి చెందిన మేయర్ అనే కారణంతో పోలీసులు ఇంతవరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ గూండాలు సృష్టించిన భయాందోళనల వల్ల వర్షిత్ రెడ్డి తల్లి తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై గుండెపోటు రావడంతో ప్రస్తుతం యశోద ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ దాడికి కారకులైన కాంగ్రెస్ మేయర్, ఆయన రౌడీ మూకలపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని గవర్నర్ ను కోరామన్నారు.

హోం శాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో మహిళలపై నేరాల రేటు దాదాపు రెట్టింపు అయిందని శిల్పారెడ్డి విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలపై నేరాలకు సంబంధించి ఏకంగా 24,945 కేసులు నమోదు కావడం పాలనా వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఇందులో 5,940 లైంగిక దాడులు), 2,945 అత్యాచారాలు, 3,145 పోక్సో కేసులు, 1,735 మైనర్ల అపహరణ కేసులు ఉండటం తీవ్ర దిగ్భ్రాంతి కలిగిస్తోందన్నారు. మైనర్లపై నేరాల విషయంలో తెలంగాణ దేశంలోనే 2వ స్థానంలో, మహిళలపై డిజిటల్ వేధింపులలో దేశంలోనే 4వ స్థానంలో నిలవడం సిగ్గుచేటన్నారు. ఓటు బ్యాంకు, మైనారిటీ బుజ్జగింపు రాజకీయాల కోసమే ప్రభుత్వం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. పోలీస్ స్టేషన్లకు వెళ్లి మహిళలు ఫిర్యాదు చేయాలనుకుంటే కౌన్సిలింగ్, రాజీ పేరిట కాలయాపన చేస్తున్నారే తప్ప దోషులను శిక్షించడం లేదన్నారు. రాష్ట్రంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, షీ టీమ్స్ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేస్తున్న మహిళా వైద్య సిబ్బందికి తగిన భద్రత కల్పించాలని, అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేట్ బాలికల హాస్టళ్లలో కట్టుదిట్టమైన భద్రతను మెరుగుపరచాలని, రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నర్ కు విజ్ఞప్తి చేసినట్లు డాక్టర్ మేకల శిల్పారెడ్డి వెల్లడించారు.

# ఆంధ్రా పేపర్స్‌పై పవన్ ఫైర్



**అమరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్‌లో పర్యావరణ పరిరక్షణ, స్థానిక సంస్థల ఆదాయాల విషయంలో ఉప ముఖ్యమంత్రి, అటవీ-పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ మరోసారి కఠిన వైఖరి ప్రదర్శించారు. రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపర్స్ పరిశ్రమపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వెల్లడైంది. పరిశ్రమలు పర్యావరణ నిబంధనలు పాటించడంతో పాటు స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన పన్నులను కూడా సక్రమంగా చెల్లించాలని స్పష్టం చేశారు. ఆంధ్రా పేపర్స్ విషయంలో పన్నుల బకాయిలు, గోదావరి కాలుష్యం అంశాలను ప్రస్తావిస్తూ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**రూ.21.34 కోట్ల బకాయిలపై సీరియస్**

వన్ కల్యాణ్ ప్రస్తావించిన వివరాల ప్రకారం.. ఆంధ్రా పేపర్స్‌కు సంబంధించి రూ.21.34 కోట్ల మేర స్థానిక పన్నుల బకాయిలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. 2016 తర్వాత పన్నుల చెల్లింపు పై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పరిశ్రమల నుంచి వచ్చే పన్నులే గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు, సిబ్బంది జీతాలు వంటి కనీస వసతులకు కీలక ఆదాయ వనరులని ఆయన పేర్కొన్నారు. పన్నులు చెల్లించకుండా ప్రజలకు పరోక్షంగా ఇబ్బందులు కలిగించే పరిస్థితిని అనుమతించబోమని స్పష్టం చేశారు.

# పట్టపగలే.. చిమ్మచీకటి

( మొదటి పేజీ తరువాయి )




ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్ రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి.ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# గంజాయి కొట్టి విమానం నడిపిన పైలట్

( మొదటి పేజీ తరువాయి )




విడుదల చేసిన 10 పేజీల ప్రాథమిక నివేదిక ప్రకారం, విమానం ఢిల్లీలో దిగిన అనంతరం మొత్తం 24 మందికి వైద్య సహాయం అందించారు. వారిలో నలుగురికి తీవ్ర గాయాలైనట్లు అధికారులు తెలిపారు. విమానంలో చోటుచేసుకున్న కుదుపులు, ప్రయాణికులకు గాయాలు కావడం వంటి అంశాలను పరిశీలించిన తర్వాత ఏఏఐబీ ఈ ఘటనను ప్రమాదంగా పరిగణించింది. ఘటనకు దారితీసిన కారణాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించింది. దర్యాప్తులో భాగంగా విమాన సిబ్బందికి నిర్వహించిన పరీక్షల్లో పైలట్ ఇన్‌కమాండ్‌కు సంబంధించిన పరీక్షలో సైకోయాక్టివ్ పదార్థం వినియోగించినట్లు నిర్ధారణ అయింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో ఏఏఐబీ ఆందోళన వ్యక్తం చేసింది. విమానయాన రంగంలో భద్రత అత్యంత కీలకమైన అంశమైనందున, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా డీజీసీఏ తగిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది.

డీజీసీఏకు కీలక సిఫార్సు

మత్తు పదార్థాల దుర్వినియోగాన్ని నిరోధించేందుకు నియంత్రణ సంస్థగా డీజీసీఏ అవసరమైన చర్యలు చేపట్టాలని ఏఏఐబీ సిఫార్సు చేసింది. పైలట్లు, ఇతర విమాన సిబ్బంది విధుల్లో ఉన్నప్పుడు మత్తు పదార్థాల ప్రభావానికి లోనుకాకుండా పర్యవేక్షణ వ్యవస్థలను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి తెరపైకి తెచ్చింది. అయితే పైలట్ సైకోయాక్టివ్ పదార్థం తీసుకోవడం విమానంలో చోటుచేసుకున్న 300 అడుగుల ఎత్తు తగ్గడానికి నేరుగా కారణమైందా? అనే అంశంపై తుది నిర్ణయం రావాల్సి ఉంది. దీనిపై ఏఏఐబీ దర్యాప్తు కొనసాగిస్తోంది. విమానానికి సంబంధించిన డేటా, రికార్డులు, ఇతర ఆధారాలను దర్యాప్తు బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ఘటనపై పూర్తి వివరాలను తెలుసుకునేందుకు ఢిల్లీ విమానాశ్రయంలో విమాన సిబ్బంది, క్యాబిన్ సిబ్బందిని అధికారులు ప్రశ్నించారు. క్యాబిన్ సూపర్‌వైజర్‌తోనూ మాట్లాడినట్లు ఏఏఐబీ వెల్లడించింది. ఆ తర్వాత విమానంలో ఉన్న ఇద్దరు పైలట్లను కూడా దర్యాప్తు బృందం విడిగా ఇంటర్వ్యూ చేసింది. విమానం ప్రయాణ సమయంలో ఏం జరిగింది? కుదుపులకు కారణాలేంటి? సిబ్బంది పరిస్థితి ఎలా ఉంది? వంటి అంశాలపై వివరాలు సేకరించింది.

# క్రికెట్ ఫ్యాన్స్‌కు పండగ

- మెగా ఈవెంట్స్ అన్నీ మన గడ్డమీదే !
- ఏడాది ఆరంభం నుంచే క్రికెట్ కిక్కు
- ఒకటి ముగిసేలోపే మరోటి
- అభిమానులకు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



**హైదరాబాద్, మహా :** భారత క్రికెట్ అభిమానులకు 2027 ఏడాది ఓ రేంజ్‌లో ఉండబోతోంది. జనవరి నుంచి మే వరకు దాదాపు ఐదు నెలల పాటు దేశంలో వరుసగా హైప్రొఫైల్ క్రికెట్ ఈవెంట్లు జరగనున్నాయి. మహిళల క్రికెట్ లో డబ్ల్యూపీఎల్ తో మొదలయ్యే హంగామా ఆ వెంటనే ఆస్ట్రేలియాతో ప్రతిష్ఠాత్మక బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ, ఫిబ్రవరిలో తొలిసారిగా జరగనున్న మహిళల చాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆథిధ్యం ఇవ్వడం.., మార్చి నుంచి మే వరకు ఐపీఎల్ తో మరింత పీక్స్‌కు చేరనుంది. 2027 ఆరంభం నుంచి క్రికెట్ క్యాలెండర్‌లో ఒక్క నెల కూడా బోర్ కొట్టించేలా కనిపించడం లేదు.

**జనవరి.. డబ్ల్యూపీఎల్ హంగామా**

మహిళల క్రికెట్‌కు ఆదరణ పెరుగుతుండటంతో డబ్ల్యూపీఎల్‌కు కూడా భారీ ఫ్యాన్ బేస్ ఏర్పడింది. దీంతో 2027 క్రికెట్ సీజన్‌కు మహిళల ప్రీమియర్ లీగ్ హైప్‌తోనే తెరలేచే అవకాశం ఉంది. భారత మహిళా క్రికెట్ లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ లీగ్.. మరోసారి స్టార్ ప్లేయర్ల ఆటతో అభిమానులను అలరించనుంది. ఫ్రాంచైజీల మధ్య హోరాహోరీ పోటీ, భారత మహిళా క్రికెటర్ల సత్తా, అంతర్జాతీయ స్టార్ ప్లేయర్ల మెరుపులతో జనవరి నుంచే దేశంలో క్రికెట్ సందడి మొదలుకానుంది.అదే సమయంలో భారత పురుషుల జట్టు ఆస్ట్రేలియాతో ప్రతిష్ఠాత్మక బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో తలపడనుంది. ఐదు టెస్టుల ఈ సిరీస్ జనవరి 21 నుంచి మార్చి 3 వరకు భారత్‌లో జరగనుంది. నాగ్‌పూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్ వేదికలుగా మ్యాచ్‌లు జరగడంతో..డబ్ల్యూపీఎల్ సందడితో పాటు టెస్టు క్రికెట్ ఉత్కంఠ కూడా జనవరి నుంచే అభిమానులను అలరించనుంది.అయితే ఈ సిరీస్ కేవలం భారత్‌ఆస్ట్రేలియా పోరు మాత్రమే కాదు.. 2027 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో భారత్‌కు అత్యంత కీలకంగా మారనుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉండటంతో.. ఫైనల్ బెర్త్ కోసం మిగిలిన మ్యాచ్‌ల్లో ప్రతి విజయం కీలకమే. ముఖ్యంగా ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల్లో సాధించే ఫలితాలు భారత్ అవకాశాలను గణనీయంగా ప్రభావితం చేయనున్నాయి. దీంతో బోర్డర్‌గావస్కర్ ట్రోఫీకి ఈసారి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. భారత్ ఫైనల్ చేరాలంటే మిగిలిన ఏడు టెస్టుల్లో సాధ్యమైనంత ఎక్కువ విజయాలు సాధించాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియాపై 4-1 లేదా 3-1తో సిరీస్ గెలిస్తే అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయి. 3-2తో సిరీస్ గెలిచినా.. ఇతర జట్ల ఫలితాలు కూడా భారత్‌కు అనుకూలంగా రావాల్సి ఉంటుంది. అంటే ఆస్ట్రేలియాతో జరిగే ప్రతి టెస్టు ఫలితం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో భారత్ పరిస్థితిని ప్రభావితం చేయనుంది. అందుకే 2027 జనవరి నుంచి మార్చి వరకు జరిగే ఈ సిరీస్‌పై అభిమానులు, క్రికెట్ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొననుంది.

**ఫిబ్రవరి.. మహిళల క్రికెట్‌కు చారిత్రక నెల**

తొలిసారిగా నిర్వహించనున్న ఐసీసీ మహిళల చాంపియన్స్ ట్రోఫీ ఫస్ట్ ఎడిషన్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ టోర్నీ ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు జరగనుండగా మహిళల క్రికెట్‌లో కొత్తగా ఆవిష్కరిస్తున్న ఈ మెగా టోర్నీకి తొలి వేదికగా నిలిచే అవకాశం భారత్‌కు దక్కింది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంకతో కూడిన ఆరు జట్లు టైటిల్ కోసం పోటీ పడనున్నాయి. ముంబైలోని క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా, వడోదరలోని వడోదర ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనున్నాయి.తొలి ఎడిషన్ కావడంతో ఈ టోర్నీకి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. అంతేకాదు.. మహిళల చాంపియన్స్ ట్రోఫీని టీ 20 అంతర్జాతీయ ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. ఆరు జట్లు రౌండ్ రాబిన్ లీగ్‌లో తలపడిన తర్వాత పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు ఫిబ్రవరి 28న జరిగే ఫైనల్‌లో టైటిల్ కోసం పోటీ పడతాయి. మొత్తం 16 మ్యాచ్‌లతో జరిగే ఈ మెగా టోర్నీలో ప్రపంచంలోని అగ్రశ్రేణి మహిళా క్రికెటర్లు ఒకే వేదికపై తలపడనున్నారు. వాస్తవానికి ఈ తొలి ఎడిషన్‌మకు శ్రీలంక ఆతిథ్యం ఇవ్వాల్సి ఉండగా, ఆతిథ్య హక్కులు భారతదేశానికి బదిలీ అయ్యాయి. దీంతో, ఈ కొత్త మెగా టోర్నమెంట్‌కు మొదటి ఎడిషన్ నుంచే ఆతిథ్యం ఇచ్చే గౌరవం భారతదేశానికి దక్కింది. ప్రపంచంలోని టాప్ మహిళా జట్లన్నీ భారత గడ్డపై పోటీ పడటం ఈ టోర్నీకి మరింత క్రేజ్ తీసుకురానుంది.

**మార్చి.. ఐపీఎల్ కోసం ఎదురుచూపులు**

మహిళల చాంపియన్స్ ట్రోఫీ ముగిసిన వెంటనే క్రికెట్ అభిమానుల ఫోకస్ ఐపీఎల్ వైపు మళ్లనుంది. 2027 ఐపీఎల్ మార్చి 10 నుంచి మే 15 వరకు జరగనుంది. దాదాపు రెండు నెలల పాటు సాగే ఈ మెగా లీగ్‌తో దేశంలో క్రికెట్ హంగామా పీక్స్‌కు చేరనుంది. స్టార్ ఆటగాళ్లు, యువ ప్రతిభ, హైవోల్టేజ్ మ్యాచ్‌లతో ప్రతి రోజూ క్రికెట్ సందడే కనిపించనుంది. జనవరిలో డబ్ల్యూపీఎల్ సందడి.. అదే సమయంలో బోర్డర్‌గావస్కర్ ట్రోఫీతో టెస్టు క్రికెట్ హీట్.. ఫిబ్రవరిలో తొలిసారి నిర్వహిస్తున్న మహిళల చాంపియన్స్ ట్రోఫీ తొలి ఎడిషన్‌కు భారత్ ఆతిథ్యం.. ఆ వెంటనే మార్చి నుంచి ఐపీఎల్ ధమాకా.. ఇలా 2027 తొలి ఐదు నెలలు భారత క్రికెట్ అభిమానులకు ఫుల్ క్రికెట్ ఫీస్ట్‌గా మారనున్నాయి.ఒక టోర్నీ ముగిసేలోపే మరో హైప్రొఫైల్ ఈవెంట్ మొదలవుతూ.. ఏడాది ఆరంభం నుంచే క్రికెట్ సందడి కొనసాగనుంది. ఇది కేవలం వరుసగా టోర్నీలు జరగనున్న క్యాలెండర్ మాత్రమే కాదు.. ప్రపంచ క్రికెట్‌లో భారత్ ఎంత కీలకమైన మార్కెట్‌గా, ఆతిథ్య కేంద్రంగా ఎదిగిందో చెప్పే పరిణామం కూడా... ఇలా ఒక మెగా ఈవెంట్ ముగిసేలోపే మరో హైప్రొఫైల్ టోర్నీ మొదలవడం 2027 ఏడాదిని మరింత ప్రత్యేకంగా మార్చనుంది.

# దమ్ముంటే హరీశ్ రావు భార్య నాపై పోటీ చేయాలి

**హైదరాబాద్, మహా :** రాబోయే ఎన్నికల్లో దమ్ము ధైర్యముంటే హరీశ్‌రావు తన భార్యను తనపై పోటీకి దింపాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత బహిరంగ సవాల్ విసిరారు. కవితను ఓడించేందుకు అవసరమైతే హరీష్ రావు భార్యను కేసీఆర్ ను ఒప్పించి బరిలోకి దింపుతామంటూ హరీష్ రావు అనుచరులు సవాల్ చేసిన నేపథ్యంలో కవిత రియాక్టయ్యారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించిన కవిత... హరీశ్‌రావు నేరుగా బరిలోకి రాకుండా తెరవెనుక రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అవసరమని భావిస్తే రాజకీయాలను పక్కనపెట్టి ఆయన తన భార్యను బరిలోకి దించవచ్చని, ఆమె తనపై పోటీ చేసినా స్వాగతిస్తానని స్పష్టం చేశారు. గతంలో సిద్దిపేట నుంచి హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాటను గుర్తు చేసిన కవిత... వచ్చే ఎన్నికల్లో తాను సిద్దిపేట లేదా బోధన్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు సంకేతాలిచ్చారు.

# ఏపీలో మున్సిపల్ కార్పొరేషన్ల వార్డుల పునర్విభజన షెడ్యూల్ విడుదల

- 11 వరకు ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ
- 13 న డీలిమిటేషన్ వార్డుల తుది ప్రకటవ
- 14 న గెజిట్ విడుదల

**అమరావతి. మహా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియకు పురపాలక శాఖ డైరెక్టర్ షెడ్యూల్ విడుదల చేశారు. దీనికి సంబంధించి తక్షణమే ప్రతిపాదనలు పంపాలని అన్ని ప్రధాన కార్పొరేషన్లకు ఆదేశాలు జారీ చేశారు. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని ఈ వార్డుల పునర్విభజనను చేపట్టనున్నారని సమాచారం. ఈ ప్రతిపాదనలపై నేటి నుంచి 7 రోజుల పాటు (ఈ నెల 11వ తేదీ వరకు) ప్రజల నుంచి అభ్యంతరాలు,సూచనలు స్వీకరించనున్నట్లు పురపాలక శాఖ తెలిపింది.

ఆ తర్వాత పురపాలక డైరెక్టర్ పరిశీలించి ఆమోదం తెలిపిన అనంతరం సెప్టెంబర్ 13న డీలిమిటేషన్ వార్డుల తుది ప్రకటన వెలువడనుంది. మరుసటి రోజు, అంటే ఈ నెల 14న ఆంధ్రప్రదేశ్ అధికారిక గెజిట్‌లో వార్డుల పునర్విభజన ప్రకటనను ప్రచురిస్తారు. ఈ ఆదేశాలు జీవీఎంసీ (విశాఖపట్నం), విజయవాడ, మచిలీపట్నం, కర్నూలు, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, కడప, ఏలూరు, అనంతపురం, చిత్తూరు వంటి రాష్ట్రంలోని ప్రముఖ కార్పొరేషన్లన్నింటికీ వర్తిస్తాయని అధికారులు వెల్లడించారు. 39 పట్టణ స్థానిక సంస్థలలో (యూఎల్ బీ) వార్డుల పునర్విభజన పూర్తయ్యే కాలపరిమితి..

పార్వతీపురం: 03.09.2026
సాలూరు: 03.09.2026
నర్సీపట్నం: 03.09.2026
విజయవాడ: 03.09.2026
రామచంద్రపురం: 03.09.2026
జగ్గయ్యపేట: 03.09.2026
మాచర్ల: 03.09.2026
వినుకొండ: 03.09.2026
సత్తెనపల్లి: 03.09.2026
మార్కాపురం: 03.09.2026
చీరాల: 03.09.2026
చిత్తూరు: 03.09.2026
అనంతపురం: 03.09.2026
కర్నూలు: 03.09.2026
ప్రొద్దుటూరు: 03.09.2026
రాయచోటి: 03.09.2026
రాయదుర్గం: 03.09.2026
పుట్టపర్తి: 03.09.2026
బద్వేల్: 03.09.2026
నగరి: 03.09.2026
పుత్తూరు: 03.09.2026
కదిరి: 03.09.2026
ఎర్రగుంట్ల: 03.09.2026
జమ్మలమడుగు: 03.09.2026
పలమనేరు: 03.09.2026
తిరుపతి: 03.09.2026
జీవీఎంసీ (జివిఎంసి): 08.09.2026
ఏలూరు: 08.09.2026
మచిలీపట్నం: 08.09.2026
పెడన: 08.09.2026
పిఠాపురం: 08.09.2026
ఒంగోలు: 08.09.2026
చిలకలూరిపేట: 15.09.2026
నెల్లూరు: 15.09.2026
గుంటూరు: 08.09.2026
కడప: 08.09.2026
ధర్మవరం: 08.09.2026
తాడిపత్రి: 08.09.2026
నంద్యాల: 08.09.2026

# బస్ చక్రం తిరిగింది.. ఆర్టీసీ దశ తిరిగింది!

ఒక బస్సు బయలుదేరితే.. అందులో కేవలం ప్రయాణికులు మాత్రమే కదలరు. ఒక విద్యార్థి భవిష్యత్తు వైపు అడుగేస్తాడు.. ఒక తల్లి ఆసుపత్రికి చేరుతుంది.. ఒక రైతు తన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లే మార్గం వెతుక్కుంటాడు.. ఒక ఉద్యోగి తన జీవనోపాధి కోసం పరుగులు తీస్తాడు.. ఒక చిరు వ్యాపారి తన కుటుంబాన్ని నిలబెట్టుకునేందుకు మరో అడుగు ముందుకు వేస్తాడు. అందుకే ఆర్టీసీ అంటే కేవలం బస్సులు కాదు.. తెలంగాణ ప్రజల నిత్యజీవితంతో పెనవేసుకున్న జీవనాడి. గ్రామ గడప నుంచి మహానగర వీధి వరకు.. తెల్లవారుజామున తొలి సర్వీసు నుంచి అర్ధరాత్రి చివరి బస్సు వరకు.. కోట్లాది మంది జీవితాల్లో ఆర్టీసీకి విడదీయరాని స్థానం ఉంది. ఇంటి నుంచి బయట అడుగుపెట్టిన క్షణం నుంచి గమ్యస్థానానికి చేరే వరకు ప్రజల వెంట నడిచే ప్రజా రవాణా వ్యవస్థ అది. అందుకే ఆర్టీసీ బలపడటం అంటే కేవలం ఒక సంస్థ బలపడటం కాదు.. ప్రజల ప్రయాణం సులభం కావడం.. పేద కుటుంబాలపై భారం తగ్గడం.. గ్రామాలకు అవకాశాలు చేరడం.. తెలంగాణ ఆర్థిక చలనానికి వేగం పెరగడం. ఒక దశలో నష్టాలు.. అప్పులు.. బకాయిలు.. వాహనాల కొరత.. కార్మికుల సమస్యలు.. సౌకర్యాల లోపాలతో సవాళ్లను ఎదుర్కొన్న ఆర్టీసీకి ప్రజా ప్రభుత్వం కొత్త దిశ చూపింది. సంస్థను కేవలం నష్టాల నుంచి బయటకు తీసుకురావడమే కాకుండా.. ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్చడం, కార్మికులకు భరోసా ఇవ్వడం, మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించడం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, పర్యావరణహిత రవాణా వైపు నడిపించడం వంటి బహుముఖ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. వెయ్యి రోజుల ప్రజాపాలనలో ఆర్టీసీలో చోటుచేసుకున్న మార్పు ఇదే.




కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ప్రారంభించిన మహాలక్ష్మి పథకం ప్రజా రవాణా చరిత్రలోనే ఒక కీలక మలుపుగా నిలిచింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ప్రయాణం వారి హక్కుగా మారింది. ఇప్పటివరకు 347.36 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించగా.. రూ.12,167 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఆదా అయిన ప్రతి రూపాయి ఒక కుటుంబానికి ఊరట. బస్సెక్కిన ప్రతి మహిళ వెనుక ఒక అవసరం.. ఒక లక్ష్యం.. ఒక కుటుంబ భవిష్యత్తు ఉంది. ఉద్యోగానికి వెళ్లే మహిళ నుంచి వైద్యం కోసం బయలుదేరిన తల్లి వరకు.. విద్య కోసం ప్రయాణించే విద్యార్థిని నుంచి స్వయం ఉపాధి కోసం అడుగులు వేసే మహిళ వరకు.. మహాలక్ష్మి వారి కదలికకు తోడుగా నిలిచింది. ఇది కేవలం ఉచిత ప్రయాణం కాదు.. మహిళకు అందిన ప్రయాణ స్వేచ్ఛ.. కుటుంబానికి దక్కిన ఆర్థిక వెసులుబాటు. మహాలక్ష్మి పథకం అనంతరం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య పెరిగింది. ఒకప్పుడు సుమారు 67 శాతంగా ఉన్న ఆక్యుపెన్సీ 89 శాతానికి చేరింది. ఇది కేవలం ఒక గణాంకం కాదు. ప్రజలు మళ్లీ ఆర్టీసీ వైపు చూస్తున్నారనే సంకేతం. ఖాళీగా వెళ్లే బస్సుల స్థానంలో ప్రయాణికులతో కళకళలాడే బస్సులు.. తగ్గుతున్న నమ్మకానికి బదులు పెరుగుతున్న ఆదరణ.. ఇదే మారుతున్న ఆర్టీసీ ముఖచిత్రం.

ప్రజల అవసరాలకు తగ్గట్టుగా ఆధునిక బస్సులను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులు కొనుగోలు చేయగా.. 1,024 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా సేవలందిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయి. డీజిల్ వాహనాల నుంచి ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు అడుగులు వేయడం ద్వారా ప్రజా రవాణాకు కొత్త రూపం వస్తోంది. కాలుష్య నియంత్రణతో పాటు ఆధునిక, పర్యావరణ హిత ప్రయాణానికి బాటలు పడుతున్నాయి. మహిళా సాధికారతను మరో స్థాయికి తీసుకెళ్లేలా 600 ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులుగా తీర్చిదిద్దే కార్యక్రమం చేపట్టడం వినూత్న అడుగుగా నిలిచింది. ప్రతి బస్సుకు సుమారు రూ.69,468 చొప్పున నెలవారీ ఈఎంఐ చెల్లిస్తూ.. ఇప్పటివరకు సుమారు రూ.29.31 కోట్లు చెల్లించారు. ప్రయాణించే మహిళ చేతిలో టికెట్ మాత్రమే కాదు.. బస్సు యాజమాన్యం కూడా ఉండేలా చేస్తున్న ఈ ఆలోచన సంక్షేమాన్ని ఆర్థిక సాధికారతతో అనుసంధానించిన కొత్త నమూనా.

ఆర్టీసీ బస్సు ఎంత ఆధునికమైనదైనా.. దాన్ని నడిపేది డ్రైవర్. ఎంత మంచి సౌకర్యాలున్నా.. ప్రయాణికుడికి సేవ చేసేది కండక్టర్. అందుకే ఆర్టీసీ పురోగతికి కార్మికులే అసలైన చోదకశక్తి. కార్మికులకు రెండు పీఆర్సీలు, ఐదు డీఏలు అందడంతో పాటు పెండింగ్ డీఏలు లేకుండా చర్యలు చేపట్టారు. 1,424 కారుణ్య నియామకాలు చేపట్టి బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. సర్వీసు నుంచి తొలగించబడిన సుమారు 244 మంది ఉద్యోగులను ప్రత్యేక ఐఏఎస్ కమిటీ పరిశీలన అనంతరం తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. ప్రతి నెల మంగళవారం కార్మికుల గ్రీవెన్స్ డే నిర్వహిస్తూ సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టి 4,538 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇప్పటికే 1,000 డ్రైవర్, 743 శ్రామిక పోస్టుల నియామకాలు పూర్తయ్యాయి. మరో 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నియామకాల్లో పారదర్శకతకు ప్రాధాన్యత నిస్తూ పోలీసు శాఖ ద్వారా ఎంపిక ప్రక్రియ చేపట్టడం ద్వారా అక్రమాలకు తావులేకుండా చర్యలు చేపట్టారు. సంస్థ ఆర్థిక స్థిరత్వానికి బకాయిల తగ్గింపు కీలకం. ఈ దిశగా ఆర్టీసీపై ఉన్న ఆర్థిక భారాన్ని క్రమంగా తగ్గిస్తున్నారు. సీసీఎస్ బకాయిలు: రూ.1,096 కోట్ల నుంచి రూ.939 కోట్లు, పీఎఫ్ బకాయిలు: రూ.2,108 కోట్ల నుంచి రూ.1,710 కోట్లు, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ బకాయిలు: రూ.513 కోట్ల నుంచి రూ.485 కోట్లు, నష్టాల నీడ నుంచి బయటపడుతూ.. ఆర్థిక క్రమశిక్షణ వైపు అడుగులు పడుతున్నాయి. బస్సు అందని ప్రాంతం ఉంటే అక్కడ ప్రజల అవకాశాలు కూడా పరిమితమవుతాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వరకు రవాణా సేవలను విస్తరిస్తున్నారు. హైదరాబాద్‌లో 370 కొత్త రూట్లలో బస్సు సేవలు అందుబాటులోకి వచ్చాయి. గ్రామాల్లోనూ బస్సు సౌకర్యం లేని ప్రాంతాలకు కొత్త సర్వీసులను విస్తరిస్తున్నారు. మెట్రో.. ఎంఎంటీఎస్.. ఆర్టీసీ సమన్వయంతో లాస్ట్ మైల్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. వాహన్, సారథి సేవలను అందుబాటులోకి తీసుకురావడం.. టీఎస్ నుంచి టీజీకి వాహన రిజిస్ట్రేషన్ మార్పు.. వాహన స్క్రాపింగ్ పాలసీ.. ఎలక్ట్రానిక్ టికెటింగ్.. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టులు.. ఇవన్నీ రవాణా వ్యవస్థలో మారుతున్న కాలానికి అనుగుణంగా చేపట్టిన సంస్కరణలకు ప్రతీకలు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు పన్ను మినహాయింపులు కల్పించడంతో ఇప్పటివరకు 1,58,157 ఎలక్ట్రిక్ వాహనాలకు రూ.1,493 కోట్ల మేర మినహాయింపు లభించింది. కాలుష్యం తగ్గాలి.. రవాణా వేగం పెరగాలి.. సేవలు సులభం కావాలి.. ఇదే సాంకేతిక సంస్కరణల లక్ష్యం.

ఆటో డ్రైవర్లు కూడా నగర ప్రజా రవాణాలో కీలక భాగస్వాములే. వారి సంక్షేమానికి చర్యలు చేపడుతూ.. హైదరాబాద్‌లో డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా రెట్రోఫిట్ చేసుకునేందుకు ఒక్కో వాహనానికి రూ.1.50 లక్షల వరకు సహాయం అందించే చర్యలు చేపట్టారు. ఓఆర్ఆర్ పరిధిలో ఎలక్ట్రిక్, సీఎన్‌జీ, ఎల్‌పీజీ, రెట్రోఫిటెడ్ ఎలక్ట్రిక్ త్రీ వీలర్లకు కొత్త అనుమతులకూ మార్గం సుగమం చేశారు.

'అరైవ్-అలైవ్' ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ప్రమాద సమయంలో బాధితులను త్వరగా ఆసుపత్రికి చేర్చేందుకు రహవీర్ పథకాన్ని అమలు చేస్తున్నారు. రవాణా శాఖలో 113 ఏఎంవీఐలు, 50 మంది కానిస్టేబుళ్లు, 20 మంది జూనియర్ అసిస్టెంట్లు, 4 ఎంవీఐలను నియమించి శాఖను బలోపేతం చేశారు. 60 ఏఎన్‌పీఆర్ కెమెరాల ఏర్పాటుతో ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు.

మేడారం జాతర వంటి భారీ ఉత్సవాల్లో ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ తన బాధ్యతను నిర్వర్తించింది. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని బస్‌స్టేషన్ల ఆధునీకరణ, ప్రత్యేక బస్సుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో కొన్ని రూట్లలో రాత్రి బస్సు సర్వీసులను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆర్టీసీ బస్సు చక్రం తిరిగేది రోడ్డుపైనే కావచ్చు. కానీ దాని ప్రభావం ఒక కుటుంబం నుంచి మరో కుటుంబానికి.. ఒక గ్రామం నుంచి మరో పట్టణానికి.. ఒక మార్కెట్ నుంచి మరో వ్యాపార కేంద్రానికి విస్తరిస్తుంది. ఆర్టీసీ బస్సులో ఎక్కేది ఒక ప్రయాణికుడు కావచ్చు.. కానీ కదిలేది ఒక కుటుంబం. ఒక బస్సు ఒక గ్రామానికి చేరితే.. అక్కడికి ఒక అవకాశం చేరుతుంది. ఒక కొత్త రూటు వస్తే.. అక్కడి ప్రజలకు కొత్త ప్రపంచం తెరుచుకుంటుంది. ఒక మహిళ ఉచితంగా ప్రయాణిస్తే.. ఆ కుటుంబ బడ్జెట్‌లో ఒక భారం తగ్గుతుంది. ఒక యువకుడికి ఉద్యోగం వస్తే.. ఒక ఇంట్లో భవిష్యత్తుపై నమ్మకం పెరుగుతుంది. ఇదే ఆర్టీసీకి.. తెలంగాణ ప్రజలకు ఉన్న అవినాభావ సంబంధం. అందుకే ఆర్టీసీని బలోపేతం చేయడం అంటే కేవలం ఒక ప్రభుత్వ రంగ సంస్థను కాపాడటం కాదు.. ప్రజల జీవన గమనానికి వేగం ఇవ్వడం. వెయ్యి రోజుల ప్రజాపాలనలో ఆర్టీసీ ప్రయాణం ఒక స్పష్టమైన మార్పును చూపిస్తోంది. మహిళా సాధికారత నుంచి కార్మిక సంక్షేమం వరకు.. కొత్త బస్సుల నుంచి ఎలక్ట్రిక్ మొబిలిటీ వరకు.. గ్రామీణ రూట్ల నుంచి నగర రవాణా సమన్వయం వరకు.. ఉద్యోగాల నుంచి డిజిటల్ సేవల వరకు.. ప్రతి అడుగులోనూ మార్పు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో రవాణా రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

**మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ.**

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీని కేవలం ఒక ప్రజా రవాణా సంస్థగా కాకుండా.. కోట్లాది మంది ప్రజల జీవితాలతో ముడిపడిన జీవనాడిగా భావిస్తూ దాని బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆర్టీసీ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ.. సంస్థను ఆధునికీకరించడంతో పాటు ఆర్థికంగా పరిపుష్టం చేసే చర్యలకు అండగా నిలుస్తోంది. కొత్త బస్సులు, ఎలక్ట్రిక్ బస్సులు, బస్‌స్టేషన్ల ఆధునీకరణ నుంచి కొత్త రూట్ల విస్తరణ, ఆధునిక సాంకేతికత, రోడ్డు భద్రత వరకు ప్రతి రంగంలో మంత్రి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. అదే సమయంలో ఆర్టీసీకి వెన్నెముకగా ఉన్న కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పీఆర్సీలు, డీఏలు, కారుణ్య నియామకాలు, ఉద్యోగ భర్తీలు, గ్రీవెన్స్ పరిష్కారం వంటి చర్యలు చేపడుతున్నారు. మహిళా సాధికారతకు మహాలక్ష్మి పథకంతో కొత్త దిశ చూపుతూ.. పర్యావరణహిత రవాణాకు ఎలక్ట్రిక్ బస్సులతో బాటలు వేస్తూ.. ప్రయాణికుల సౌకర్యం, ఉద్యోగుల సంక్షేమం, సంస్థ ఆర్థిక స్థిరత్వం అనే మూడు అంశాలను సమన్వయం చేస్తూ ఆర్టీసీని అన్ని విధాలా బలోపేతం చేస్తున్నారు. ఈ సమగ్ర చర్యలతో తెలంగాణ ఆర్టీసీని దేశంలోనే నంబర్ 1 ప్రజా రవాణా సంస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టితో ముందుకు సాగుతున్నారు. వెయ్యి రోజులు పూర్తయ్యాయి.. కానీ ప్రయాణం ఇక్కడితో ఆగలేదు. నిన్న నష్టాల బాట.. నేడు నవశకం.. రేపు దేశంలోనే నంబర్ వన్ ప్రజా రవాణా సంస్థగా తెలంగాణ ఆర్టీసీ. బస్ చక్రం తిరుగుతూనే ఉంటుంది. ప్రజల ప్రయాణం సాగుతూనే ఉంటుంది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ అకుంఠిత దీక్ష.. కృషి ఫలితం.



బాలసాని నాగరాజు
పీఆర్వో, రాష్ట్ర రవాణా
బీసీ సంక్షేమ శాఖ మంత్రి

---

# సన్నబియ్యం అమ్మితే రేషన్ కార్డు రద్దు

- **పేదలైతే ఇందిరమ్మ ఇల్లు అర్హత.**
- **పార్టీతో సంబంధం లేదు.**
- **వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.**




**ఖమ్మం, మహా :** సన్నబియ్యాన్ని విక్రయిస్తే రేషన్ కార్డు తొలగిస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన పేదలందరికీ అందాలని, ఇందులో పార్టీలు, రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. గుడిసెల్లో నివసించే పేదలకు వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఇల్లు లేని అర్హులైన ప్రతి కుటుంబానికీ ఇల్లు అందాల్సిందేనని అన్నారు. అర్హులైన వారికి ఇళ్లు ఇవ్వకపోతే సర్పంచ్ పదవి పోయే పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు.

రఘునాథపాలెం మండలం పుటాని తండాలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అటవీ శాఖ అధికారి అనూజ్ అగర్వాల్, భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

**పోడు భూముల సమస్య పరిష్కరిస్తా**

పోడు భూముల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తుమ్మల హామీ ఇచ్చారు. కేవలం వ్యవసాయంపైనే ఆధారపడి జీవించే కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందని, వర్షాభావ పరిస్థితులతో పంటల దిగుబడిపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని తెలిపారు.

నీటి లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితుల్లోనూ రైతులకు ఆదాయం అందించే పంటగా పామాయిల్‌ను ప్రోత్సహించాలని సూచించారు. పామాయిల్ సాగు చేపట్టే రైతులకు అవసరమైన సహకారం అందిస్తామని, పంట సాగుకు సంబంధించిన పలు అంశాల్లో ఉచితంగా సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. రఘునాథపాలెం మండలానికి శుక్రవారం రాత్రికే సాగునీటిని విడుదల చేస్తామని, శనివారం రైతులు మోటార్లు ఆన్ చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. ఆర్‌వీఎఫ్‌ఆర్ పట్టా ఉన్న రైతులకు బోర్ అనుమతులు తప్పనిసరిగా ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు.

**రూ.75 కోట్లతో 200 డొంక రోడ్లు**

మండలంలో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తుమ్మల తెలిపారు. సుమారు రూ.75 కోట్లతో 200 డొంక రోడ్లను నిర్మిస్తామని చెప్పారు. రైతులు తమ పొలాలకు చేరుకునేందుకు అవసరమైన రహదారులను కూడా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

**పిల్లల చదువుతోనే బతుకులు మారుతాయి**

పిల్లల భవిష్యత్తు కోసం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందకపోతే వారి జీవితాల్లో మార్పు సాధ్యం కాదని అన్నారు. ఈ ప్రాంతంలో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు వెచ్చించి మెరుగైన సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నప్పటికీ, కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారని తుమ్మల పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య, సదుపాయాలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, సాగునీరు, విద్య, గృహ వసతులను మెరుగుపరిచి ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

---

# విదేశీ మారక నిల్వల్లో భారత్ దూకుడు

- **729.33 బిలియన్ డాలర్లకు చేరిక.**
- **ప్రపంచ టాప్-5లో భారత్.**
- **ఆర్థిక సవాళ్ల మధ్య రికార్డు స్థాయికి విదేశీ మారక నిల్వలు.**
- **ఎనిమిది వారాలుగా వరుస పెరుగుదల.**



**న్యూఢిల్లీ, మహా :** అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఇంధన ధరల ఒత్తిళ్ల మధ్య భారత ఆర్థిక వ్యవస్థ మరో కీలక మైలురాయిని అందుకుంది. ఆగస్టు 21తో ముగిసిన వారానికి దేశ విదేశీ మారక నిల్వలు 12.422 బిలియన్ డాలర్లు పెరిగి 729.328 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది ఇప్పటివరకు నమోదైన అత్యధిక స్థాయి. అంతకు ముందు ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో నమోదైన 728.494 బిలియన్ డాలర్ల రికార్డును తాజా నిల్వలు అధిగమించాయి.

**ఎనిమిది వారాలుగా పెరుగుతున్న నిల్వలు**

విదేశీ మారక నిల్వలు వరుసగా ఎనిమిదో వారం పెరిగాయి. ఈ ఎనిమిది వారాల వ్యవధిలో మొత్తం నిల్వలు సుమారు 63 బిలియన్ డాలర్లు పెరిగాయి. ఒక్క ఆగస్టు 21తో ముగిసిన వారంలోనే 12.422 బిలియన్ డాలర్ల పెరుగుదల నమోదైంది. ఇది అంతర్జాతీయ మార్కెట్లలో ఒడిదుడుకులు కొనసాగుతున్న సమయంలో భారత్ విదేశీ మారక ద్రవ్య స్థితి ఎంత బలపడిందో సూచించే కీలక గణాంకంగా నిలిచింది.

**ఎక్కడ ఎంత ఉంది?**

ఈ మొత్తం నిల్వల్లో అత్యధిక భాగం విదేశీ కరెన్సీ ఆస్తులదే. ఆగస్టు 21 నాటికి విదేశీ కరెన్సీ ఆస్తులు 591.333 బిలియన్ డాలర్లకు చేరాయి. ఒక్క వారంలోనే ఇవి 9.482 బిలియన్ డాలర్లు పెరిగాయి. బంగారం నిల్వల విలువ కూడా 2.801 బిలియన్ డాలర్లు పెరిగి 114.218 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు 18.852 బిలియన్ డాలర్లకు, అంతర్జాతీయ ద్రవ్యనిధిలో భారత రిజర్వు స్థానం 4.925 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

**అసలు కారణం ఏంటి?**

తాజా రికార్డు వెనుక కేవలం ఒక్క అంశమే లేదని గణాంకాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా విదేశీ కరెన్సీ ప్రవాహాలను పెంచేందుకు భారతీయ రిజర్వు బ్యాంకు జూన్‌లో తీసుకొచ్చిన ప్రత్యేక చర్యలు కీలక పాత్ర పోషించాయి. విదేశీ కరెన్సీ నాన్‌రెసిడెంట్ డిపాజిట్లు, విదేశీ రుణాల ద్వారా డాలర్లను సమీకరించే అవకాశాలకు అనుకూలమైన మార్పులు చేయడంతో బ్యాంకుల ద్వారా విదేశీ కరెన్సీ ప్రవాహాలు గణనీయంగా పెరిగాయి. ఆగస్టు 21 నాటికి ఈ ప్రత్యేక పథకాల కింద ఆర్‌బీఐకి దాదాపు 73 బిలియన్ డాలర్ల ప్రవాహాలు వచ్చినట్లు రాయిటర్స్ నివేదించింది. ఇందులో సుమారు 65 బిలియన్ డాలర్లు ప్రవాస భారతీయుల డిపాజిట్ల నుంచి వచ్చినవే. ఈ స్థాయిలో స్పందన రావడంతో డిపాజిట్ హెడ్జింగ్ సౌకర్యాన్ని నిర్ణయించిన గడువు కంటే ఒక నెల ముందుగానే ముగించాలని ఆర్‌బీఐ నిర్ణయించింది.

> **ఆర్‌బీఐ జోక్యం.. రూపాయికి అండ**
>
> విదేశీ మారక నిల్వలు పెరగడంలో డాలర్ ప్రవాహాలు ఒకవైపు ఉంటే.. మరోవైపు రూపాయి విలువలో తీవ్ర ఒడిదుడుకులు రాకుండా ఆర్‌బీఐ విదేశీ మారక మార్కెట్లో జోక్యం చేసుకుంటోంది. భారీగా వచ్చే డాలర్లలో కొంత భాగాన్ని మార్కెట్ నుంచి కొనుగోలు చేయడం ద్వారా నిల్వలు పెరగడంతో పాటు రూపాయి మార్కెట్‌లో స్థిరత్వాన్ని కాపాడే ప్రయత్నం జరుగుతోంది. ఇదే సమయంలో ఈ భారీ డాలర్ ప్రవాహాల వల్ల దేశీయ ఆర్థిక వ్యవస్థలో రూపాయి ద్రవ్యత కూడా పెరిగింది. ఆగస్టులో బ్యాంకింగ్ వ్యవస్థలో అదనపు ద్రవ్యత గణనీయంగా పెరగడంతో దాన్ని ఎలా సమర్థంగా నిర్వహించాలన్నది ఆర్‌బీఐకి కొత్త సవాలుగా మారింది. విదేశీ మారక మార్పిడి ఒప్పందాలు, బాండ్ల విక్రయాలు, నగదు నిల్వల నిష్పత్తి వంటి సాధనాలతో అదనపు ద్రవ్యతను నియంత్రించే అంశాలపై బ్యాంకింగ్ రంగంలో చర్చ జరుగుతోంది.

**కరెంట్ అఫైర్స్ కోణంలో ఎందుకు కీలకం?**

దేశ విదేశీ మారక నిల్వలు అంటే కేవలం ఖజానాలో ఉన్న డాలర్ల సంఖ్య కాదు. చమురు, ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, ముడి పదార్థాలు వంటి దిగుమతులకు విదేశీ కరెన్సీ అవసరమైనప్పుడు ఈ నిల్వలు దేశానికి రక్షణగా నిలుస్తాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ఆర్థిక సంక్షోభం, ఇంధన ధరల పెరుగుదల, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు పెద్ద మొత్తంలో విదేశీ మారక నిల్వలు దేశ బాహ్య ఆర్థిక స్థిరత్వానికి కీలకమైన కవచంగా పనిచేస్తాయి.

తాజా లెక్కల ప్రకారం ప్రస్తుత నిల్వలు పది నెలలకు పైగా దిగుమతుల అవసరాలను కవర్ చేయగల స్థాయిలో ఉన్నాయని ప్రభుత్వ అనుకూల వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ స్థాయిని సాధించడంలో ప్రత్యేక డిపాజిట్ పథకాల ద్వారా వచ్చిన నిధుల పాత్ర కూడా గణనీయంగా ఉందనే విషయాన్ని విస్మరించలేం. అందువల్ల నిల్వల రికార్డును అర్థం చేసుకునేటప్పుడు వాటి పరిమాణంతో పాటు ఆ నిల్వల పెరుగుదలకు కారణమైన మూలాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం అవసరం.

**మోదీ నాయకత్వం..**
**రాజకీయ ప్రచారం వర్సెస్ ఆర్థిక వాస్తవం**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ఆర్థికంగా బలపడుతోందని, ప్రపంచంలో టాప్ 5 విదేశీ మారక నిల్వల దేశాల్లో భారత్ నిలిచిందని బీజేపీ తన ప్రచారంలో పేర్కొంది. అయితే 729.33 బిలియన్ డాలర్ల రికార్డు ఆర్‌బీఐ అధికారిక గణాంకం; దానిని మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాల విజయంగా పేర్కొనడం రాజకీయ విశ్లేషణ/ప్రచార వ్యాఖ్య. రికార్డు స్థాయి నిల్వలకు ఆర్‌బీఐ చర్యలు, విదేశీ కరెన్సీ ప్రవాహాలు, ప్రవాస భారతీయుల డిపాజిట్లు, బంగారం విలువ పెరుగుదల తదితర అంశాలు కలిసి కారణమయ్యాయి. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఈ రికార్డు కేవలం సంఖ్యల పెరుగుదలతోనే దేశ ఆర్థిక వ్యవస్థలోని అన్ని సవాళ్లు పరిష్కరించబడ్డాయని అర్థం కాదు. సెప్టెంబర్ 2న రాయిటర్స్ నిర్వహించిన ఆర్థిక నిపుణుల సర్వే ప్రకారం రూపాయిపై ఒత్తిడి కొనసాగుతున్నప్పటికీ, ఆర్‌బీఐ వద్ద ఉన్న ఈ భారీ నిల్వలు రూపాయి విలువను స్థిరీకరించేందుకు అదనపు సామర్థ్యాన్ని అందిస్తున్నాయి.



## గంగారంలో ఘనంగా శ్రీకృష్ణ భవన్ ప్రారంభం

- కౌండిన్య గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌కు శ్రీకారం..
- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, మట్టా దయానంద్ చేతుల మీదుగా ప్రారంభం

**సత్తుపల్లి,సెప్టెంబరు 4:మహా :** మండల పరిధిలోని గంగారం గ్రామంలో శ్రీకృష్ణ భవన్, కౌండిన్య గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కీ.శే. దాసరి వీరారెడ్డి, కీ.శే. లక్ష్మీకాంతమ్మల ఆశీస్సులతో, శ్రీమతి దాసరి వెంకటరామిరెడ్డి (చిట్టినాయన)-రాజకుమారి దంపతుల సౌజన్యంతో భవన్, కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారు. కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ హాజరై శ్రీకృష్ణ భవన్, కౌండిన్య గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ మందిరంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. గ్రామంలో సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ నిర్మించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. భవన్ నిర్మాణానికి సహకరించిన దాసరి వెంకట్రామిరెడ్డి-రాజకుమారి దంపతులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గంగారం కాంగ్రెస్ యువ నాయకుడు దాసరి మధుమోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కాకర్ల రేవతి, ఉప సర్పంచ్ బెజవాడ రాధ, వార్డు సభ్యులు, సత్తుపల్లి మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గౌడ సంఘం, యాదవ సంఘం నాయకులు, రామగోవిందాపురం, పాకాలగూడెం గ్రామాల సర్పంచులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

### అవసరాలకు అనుగుణంగా
# బొగ్గు ఉత్పత్తి జరగాలి

- రోజుకు 1.90 లక్షల టన్నుల నల్ల బంగారాన్ని ఉత్పత్తి చేయాలి
- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశం




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇంధన సరఫరా ఒప్పందం గల థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేయడానికి సింగరేణిలో రోజుకు 1.9 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశించారు. సింగరేణి భవన్ నుంచి ఆయన సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో శుక్రవారం బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక సమీక్షను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, అలాగే రాష్ట్ర ఇంధన శాఖ వారు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును అందించాలంటూ సమీక్షలు నిర్వహించి లక్ష్యాలను నిర్దేశిస్తున్నారని దేశ ఇంధన భద్రత రీత్యా తగినంత బొగ్గును అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ బొగ్గు ఉత్పత్తి సంస్థల పైన ఉంది కాబట్టి సింగరేణి కూడా శక్తి వంచన లేకుండా కృషిచేసి బొగ్గు ఉత్పత్తి, రవాణా పెంచాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఆయన ఏరియాల వారీగా ఇప్పటివరకు ఇవ్వబడిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిని సమీక్షించారు. ఆగస్టు 31వ తేదీ నాటికి ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు నెలల కాలం పూర్తి కాగా సింగరేణి సంస్థ 253 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసిందని, దీనిలో 90 శాతం పైగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయడం జరిగిందని అధికారులు వివరించారు. కాగా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు తగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సంస్థ సీఎండీ స్పష్టం చేశారు. నైనీ బొగ్గు గని నుండి సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి మొదటి రైల్వే రేకుతో బొగ్గు సరఫరా చేయడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంపై దామరచర్ల లోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి మరొక రేకు ఇటీవల సరఫరా చేశామని ఇకముందు కూడా రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ నైనీ బ్లాక్ నుండి బొగ్గును రాష్ట్ర థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయటం జరుగుతుందని ఆయన వివరించారు. బొగ్గు ఉత్పత్తి రవాణాతోపాటు ఓవర్ బర్డెన్ తొలగింపుపై కూడా ఛైర్మన్ సమీక్షించారు. ఆగస్టు నెలాఖరి వరకు ఆఫ్ లోడింగ్ ద్వారా 1,315 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించడం జరిగిందని అయితే ఇచ్చిన లక్ష్యాలలో ఇది 95 శాతం మాత్రమే కనుక నూరు శాతం పైబడి ఓవర్ బర్డెన్ తొలగించడానికి ఆఫ్ లోడింగ్ ఏజెన్సీలను సమాయత్తం చేయాలని ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టిన ఈ సమయం ఉత్పత్తికి అనుకూలంగా ఉంది కనుక రోజువారీ లక్ష్యాలను దాటి బొగ్గు ఉత్పత్తి సాధించాలని రైల్వే విభాగం వారితో సమన్వయం జరుపుతూ నూరు శాతం పైబడి బొగ్గు రవాణా సాధించాలన్నారు. రక్షణా ప్రమాణాలు పాటిస్తూ తగిన నాణ్యత గల బొగ్గును సరఫరా చేయడానికి పై అధికారుల నుండి కింది వరకు సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్. వి సూర్యనారాయణ, డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం)ఎమ్.తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూవ్ మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ మార్కెటింగ్)టి.శ్రీనివాస్, కార్పోరేట్ జనరల్ మేనేజర్లు అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.



## ప్రతిపక్ష నాయకుడిగా కెసిఆర్ రాజీనామా చేయాలి.!

- ప్రజాస్వామ్య బాధ్యతలు విస్మరించడం సరికాదు
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడలేని నాయకుడు వద్దు
- పీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఉక్కుల అశోక్

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 4 మహా:** ప్రతిపక్ష నాయకుడి హోదాలో తన బాధ్యతలను నిర్వర్తించని కేసీఆర్ తక్షణమే రాజీనామా చేయాలని ఉక్కుల అశోక్ అన్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఉంటూ అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రజాస్వామ్య బాధ్యతలను విస్మరిస్తున్న కేసీఆర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, తెలంగాణ పీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డా. ఉక్కుల అశోక్ డిమాండ్ చేశారు.

**ప్రజాస్వామ్య బాధ్యతలు విస్మరించడం సరికాదు...**

ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రస్తావించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. అలాంటి కీలక బాధ్యతను నిర్వర్తించకుండా అసెంబ్లీకి దూరంగా ఉండడం ప్రజలు ఇచ్చిన తీర్పును, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానపరచడమేనని విమర్శించారు.

**ప్రతిపక్ష నాయకుడిగా కొనసాగే నైతిక హక్కు లేదు.!...**

ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధిగా అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై చర్చించడం ప్రతి ఎమ్మెల్యే బాధ్యత అని, ఆ బాధ్యతను నిర్వర్తించలేని పరిస్థితిలో ప్రతిపక్ష నాయకుడి పదవిలో కొనసాగడానికి నైతిక హక్కు లేదని డా. ఉక్కుల అశోక్ అన్నారు. అందువల్ల, ప్రతిపక్ష నాయకుడి హోదాలో తన బాధ్యతలను నిర్వర్తించకుండా కొనసాగుతున్న కేసీఆర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## ఈ వి ఎం గోదాము వద్ద భారీ బందోబస్తు

- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా** : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద భారీ బందోబస్తు చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల ఈ వి ఎం గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పోలీసు సిబ్బంది సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు చేపట్టడంతో పాటు 24 గంటలు సి.సి. కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలుపుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునిగా బైరు చంద్రశేఖర్



**భువనగిరి, మహా** :సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో వలిగొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలసి ఆర్ బి ఆర్ దుప్పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగాబైరు చంద్రశేఖర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం పట్ల దుప్పల్లి ప్రభుత్వ పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు పి. విజయ అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయ మాట్లాడుతూ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ విద్యార్థులను వివిధ కార్యక్రమాల్లో ప్రోత్సహిస్తూ ఇంగ్లీష్ మాట్లాడడానికి అన్ని రకాల అవకాశాలు కల్పిస్తూ మండల జిల్లా స్థాయిలో వారిని పాల్గొనేలా చేశారని వారు అభినందించారు అదేవిధంగా చంద్రశేఖర్ జిల్లా స్థాయి ఇంగ్లీష్ సబ్జెక్టు రిసోర్స్ పర్సన్ గా సేవలు అందిస్తూ పదవ తరగతి స్టడీ మెటీరియల్ తయారీలో వర్క్ బుక్ ప్రిపరేషన్లు మరియు ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఇవ్వడంలో చక్కని ప్రతిభ కనబరిచారని అభినందించారు పాఠశాల ఉపాధ్యాయ బృందం చంద్రశేఖర్ కు అభినందనలు తెలిపారు




## హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటా వార్పు
- పాల్గొన్న ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి.

**కుషాయిగూడ, మహా**: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వంటా వార్పు నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని డా. ఏఎస్ రావునగర్, వంపుగూడ, మల్లాపూర్ (అశోక్‌నగర్), నాచారం (హెచ్ఎంటీ నగర్), రామంతాపూర్ ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని నిరసన తెలిపారు.మహిళలకు నెలకు రూ.2,500, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే విమర్శించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి అర్హులందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను మరింత ఉద్ధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్లు, కొత్త రామారావు. గుండారపు శ్రీనివాస్ రెడ్డి. సప్పిడి శ్రీనివాస్ రెడ్డి. మురళి పంతులు. బీఆర్ఎస్ నాయకులు, వంజరి ప్రవీణ్ కరిపే. షేర్ మనమ్మ. బేతాళ బాలరాజ్. కుమారస్వామి. కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నేపాల్ విపత్తు బాధితులకు శ్రీరామానుజ సేవా ట్రస్టు అండ బేష్

**ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి.**

కుషాయిగూడ, మహా : నేపాల్‌లో ప్రకృతి విపత్తుతో తీవ్రంగా నష్టపోయిన బాధితుల సహాయార్థం శ్రీరామానుజ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన విరాళాల సేకరణకు దాతలు స్పందించారు. ఇప్పటివరకు రూ.10,55,116 విరాళాలు సేకరించినట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. సేకరించిన మొత్తాన్ని చెక్కు రూపంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా రక్షణ అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్, ప్రధానమంత్రికి రక్షణ సలహాదారు జి. సతీష్‌రెడ్డికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఈ మొత్తాన్ని నేపాల్ ప్రధానమంత్రి విపత్తు సహాయ నిధికి అందించనున్నట్లు తెలిపారు.విపత్తు సమయంలో బాధితులకు అండగా నిలిచి విరాళాలు అందించిన దాతలకు ట్రస్టు ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డా. ధనుంజయ, ట్రస్టు మాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, వంజరి ప్రవీణ్ పాల్గొన్నారు.



## షాద్‌నగర్‌లో బాల గోకుల సమితి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- శ్రీకృష్ణ–గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు.. విజేతలకు బహుమతులు
- బాల గోకుల సమితిని అభినందించిన ఏసీపీ లక్ష్మీనారాయణ

**షాద్‌నగర్, మహా :** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని బాల గోకుల సమితి-షాద్‌నగర్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ-గోపికల వేషధారణ పోటీలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం షాద్‌నగర్‌లోని సాయిరాజ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి బాల గోకుల సమితి అధ్యక్షులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ సీతారాం, అందె బాబన్న హాజరయ్యారు.సమితి ప్రతినిధులు వి. విజయ్‌కుమార్, జి. సత్యనారాయణ, స్వాతిరెడ్డి, వంశీకృష్ణ, ప్యాట అశోక్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొని శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారుల ఆటపాటలు, నృత్యాలు, శ్రీకృష్ణుడి బాల్య లీలలను ప్రతిబింబించే ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు, నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, షాద్‌నగర్‌లో ఇంత పెద్ద స్థాయిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్నారులను మన సంస్కృతి, సంప్రదాయాలకు చేరువ చేసేలా కార్యక్రమాన్ని నిర్వహించిన బాల గోకుల సమితి అధ్యక్షులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డిని అభినందించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో పాల్గొనడం ద్వారా మన సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవడం సంతోషకరమని తెలిపారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.




## కళాశాల అధ్యాపకుడికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

- పేదరికంతోనే విద్యాభ్యాసాన్ని పూర్తి చేశా!
- విద్యతోనే సంస్కారం గౌరవం పెరుగుతుంది
- అవార్డు గ్రహీత డాక్టర్ సోమపంగు రమేష్



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 4 మహా**: విద్యతోనే సంస్కారం గౌరవం, అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, అవార్డు గ్రహీత డాక్టర్ సోమపంగు రమేష్ అన్నారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అర్థశాస్త్ర విభాగ అధ్యాపకుడు డాక్టర్ సోమపంగు రమేష్, 2026 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ పురస్కారాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి అయిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడంగల్ లో నేడు శనివారం జరిగే సమావేశంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకోనున్నారు. ఈ అవార్డుకు ఎంపికైన వారికి ప్రశంసాపత్రం, శాలువా మరియు పదివేల రూపాయల నగదు బహుమతి అందజేయనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధిక మాట్లాడుతూ... కళాశాల స్థాయిలో ప్రతిష్టాత్మక ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక రావడం కళాశాల చరిత్రలో ఒక మైలురాయి అని అభివర్ణించారు. కళాశాల విద్యాశాఖలో ఈ అవార్డు ఎంపికకు అనేక ప్రమాణాలు పాటిస్తారని ఉదాహరణకు విద్యార్థులు ఉత్తీర్ణత శాతం, డిగ్రీ అనంతరం వారి విద్యా మరియు ఉద్యోగ అవకాశాలు, వారు సాధించిన విజయాలు, అవార్డు గ్రహీత రచించిన గ్రంథాలు, జాతీయ మరియు అంతర్జాతీయ సదస్సుల్లో పత్రికల్లో ప్రచురింపబడిన వ్యాసాలు, పెటెంట్లు కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్, కళాశాల అభివృద్ధిలో భాగస్వామ్యం, స్వచ్ఛభారత్ పర్యావరణ పరిరక్షణ, చెట్లను నాటించడం మరియు ఇతర బాధ్యతలు ఆధారంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేస్తారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా అవార్డు సాధించిన డాక్టర్ రమేష్‌ను ప్రిన్సిపల్ తో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత రమేష్ మాట్లాడుతూ... చిన్నతనం నుండి పేదరికంతో అనేక కష్టనష్టాలు ఎదుర్కొని తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారని తెలియజేశారు. విద్యతోనే అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలుసుకొని విద్యాభివృద్ధిలో అనేక మైలురాళ్లను అధిగమించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం తన బాధ్యతను మరింత పెంచిందని డాక్టర్ సోమపంగు రమేష్ తెలియజేశారు.



## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం మహా :** జిల్లా వ్యాప్తంగా శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులను కృష్ణుడు, రాధ వేషధారణల్లో అలంకరించడంతో ఇళ్ల వద్ద సందడి నెలకొంది. పిల్లల వేషధారణలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, పలుచోట్ల ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు.

## శ్రీకృష్ణుడి బోధనలు స్ఫూర్తిదాయకం

**ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** శ్రీకృష్ణుడి జీవితం, బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ధర్మాన్ని కాపాడుతూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పేందుకు శ్రీకృష్ణుడి బోధనలను ఆచరించాలని సూచించారు. డాక్టర్ ఏఎస్‌రావునగర్ డివిజన్ జేమ్మిగడ్డలో శ్రీ రాధా కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో రమేశ్ యాదవ్ నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంప్రదాయబద్ధంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శ్రీకృష్ణుడి జీవితం ధర్మం, సత్యం, న్యాయం కోసం పోరాడే స్ఫూర్తిని అందిస్తుందని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో యువతలో మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జైజవాన్ కాలనీకి చెందిన తిరుమలయ్య యాదవ్ సహకారంతో అన్నదానం నిర్వహించారు. సంఘం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిపిఆర్ఎంఎస్ కార్డులను వెంటనే రెన్యువల్ చేసుకోవాలి..

- మణుగూరు ఏరియాలో 227 మంది కార్డులు పెండింగ్..
- జీవన ధ్రువీకరణ పత్రం సమర్పించడం తప్పనిసరి
- ఏజీఎం పర్సనల్ ఎస్ రమేశ్



**మణుగూరు, మహా :** సింగరేణి సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన అనంతరం వైద్య పథకం ద్వారా ఆరోగ్య కార్డులు పొందిన మాజీ ఉద్యోగులు, తమకు అందుతున్న వైద్య సేవలు నిరాటంకంగా కొనసాగేందుకు ప్రతి సంవత్సరం జీవన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించి ఆరోగ్య కార్డులను పునరుద్ధరించుకోవాలని మణుగూరు ఏరియా ఏజీయం పర్సనల్ ఎస్ రమేశ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మణుగూరు ఏరియాలో ఇప్పటివరకు మొత్తం 4,448 ఆరోగ్య కార్డులు జారీ చేయగా, వాటిలో 4,221 కార్డుల పునరుద్ధరణ పూర్తయిందని, ఇంకా 227 మంది మాజీ ఉద్యోగుల కార్డుల పునరుద్ధరణ పెండింగ్‌లో ఉందని ఆయన తెలిపారు. సంబంధిత మాజీ ఉద్యోగులు ఎటువంటి ఆలస్యం చేయకుండా జీవన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించి తమ ఆరోగ్య కార్డులను పునరుద్ధరించుకోవాలని కోరారు.

**ఇంటి నుంచే జీవన ధ్రువీకరణ పత్రం**

2027 సంవత్సరానికి ఆరోగ్య కార్డు పునరుద్ధరణ కోసం నవంబర్ నెలలో జీవన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని రమేశ్ తెలిపారు. మాజీ ఉద్యోగులు తమ చరవాణిలోని జీవన్ ప్రమాణ్ మరియు ఆధార్ ముఖ గుర్తింపు అనువర్తనాల ద్వారా ఇంటి వద్ద నుంచే జీవన ధ్రువీకరణ పత్రాన్ని అంతర్జాలంలో సమర్పించుకోవచ్చని వివరించారు. భార్యాభర్తలు ఇద్దరూ ఇంటి నుంచే ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చన్నారు. చరవాణి ద్వారా సమర్పించలేని వారు సమీపంలోని మీసేవా కేంద్రం ద్వారా కూడా జీవన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు.

**వైద్య సేవలకు ఆటంకం రాకుండా ముందే పునరుద్ధరణ**

ఇప్పటివరకు ఆరోగ్య కార్డులను పునరుద్ధరించుకోని 227 మంది మాజీ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా జీవన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ విజ్ఞప్తి చేశారు. కార్డు పునరుద్ధరణ చేసుకోకపోవడం వల్ల వైద్య సేవలు పొందే సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.



# రామానుజవరంలో సింగరేణి ఉచిత వైద్య శిబిరం..

- 101 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..
- సింగరేణి డాక్టర్ సౌజన్య

**మణుగూరు, మహా :** సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండలం రామానుజవరం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో గ్రామానికి చెందిన 101 మంది వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా మణుగూరు ఏరియా ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ టి సౌజన్య మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తోందన్నారు. ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ఆదేశాల మేరకు రామానుజవరంలో వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. శిబిరంలో మహిళలు, పురుషులు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ, సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారితోపాటు బీపీ, షుగర్ బాధితులను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సౌజన్య సూచించారు. ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణకు దోమలు వృద్ధి చెందకుండా పూలకుండీలు, కూలర్లు, మురుగు కాలువలు తదితర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి వడబోసిన నీటిని తాగడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ యు.భవాని, సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ కెవి మారేశ్వరరావు, ఆస్పత్రి సిబ్బంది జి నాగసాయి, పంచాయతీ కార్యాలయ సిబ్బంది కల్పన తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల చిలుకూరు ఘన విజయం..

- మొదటి దశ ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో 19 మంది విద్యార్థులకు వైద్య సీట్లు..




**మొయినాబాద్ మహా:** తెలంగాణ రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రకటించిన మొదటి దశ ఏంబీబీఎస్ సీట్ల కేటాయింపులో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (ప్రీమియర్ సీవోఈ) చిలుకూరు విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. కళాశాల ప్రిన్సిపాల్ శౌరి రాజు విద్యార్థులను ప్రత్యేకంగా అభినదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి దశలో ప్రకటించిన 4,700 ఏంబీబీఎస్ సీట్లలో మా కళాశాలలో చదివిన 19 మంది విద్యార్థులు వైద్య సీట్లు సాధించడం కళాశాలకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణంగా నిలిచిందన్నారు. నాగచైతన్య అనే విద్యార్థి ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు సాధించగా.. ప్రణీత్ అనే విద్యార్థి రిమ్స్, ఆదిలాబాద్ లో ఏంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు.ఈ విజయానికి విద్యార్థుల అకుంఠిత దీక్ష, కఠోర శ్రమ, లక్ష్యసాధనతో పాటు, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఉన్నతాధికారుల మార్గదర్శకత్వం, సహకారం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. అలాగే మా కళాశాలలో పనిచేస్తున్న సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్, జూనియర్ లెక్చరర్స్, ఇతర ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది నిరంతరం అందించిన సహకారం, ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఈ విజయానికి ప్రధాన కారణాలని అన్నారు. విద్యార్థుల వెన్నంటి నిలిచి, వారి చదువుకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందించిన తల్లిదండ్రుల కృషి కూడా అభినందనీయమని అన్నారు. అందరి సమష్టి కృషి, సహకారం, విద్యార్థుల పట్టుదలతో ఈ అద్భుతమైన ఫలితాన్ని సాధించడం పట్ల కళాశాల ఎంతో సంతోషంగా ఉందన్నారు. వైద్య సీట్లు సాధించిన 19 మంది విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ.. వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి సేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# తిట్ల దండకం తప్ప..ప్రజా పాలన ఏది..?

- రియల్ ఎస్టేట్ దందాకే పరిమితమైన కాంగ్రెస్ పరిపాలన
- హామీలు గుప్పించారు అమలు చేయడంలో తూట్లు పొడిచారు
- వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం
- రేవంత్ సర్కార్ పై విరుచుకుపడ్డ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర
- భద్రాద్రి కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద నిరసన దీక్ష వంటావార్పు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పూర్తి స్థాయిలో కుంటుపడిందని సీఎం రేవంత్ రెడ్డిది తిట్ల దండకం తప్ప ప్రజా పాలన ఏది..? అంటూ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సూటిగా ప్రశ్నించారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ దందాకే కాంగ్రెస్ పరిపాలన పరిమితమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలపై శుక్రవారం జిల్లా కలెక్టరేట్ పక్కనున్న ధర్నా చౌక్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన దీక్షతో పాటుగా వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కాదని ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వంగా మారిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించలేదన్నారు. వ్యవసాయ విద్యుత్ సాగునీరు యూరియా రైతు బీమా తదితర అంశాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు.మహిళలకు నెలకు రూ.2,500, కళ్యాణ లక్ష్మి, పేదల వివాహాలకు తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు వంటి హామీలను అమలు చేయలేదని వీటిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ వంటి అంశాలపై యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. వృద్ధులు వికలాంగులు మహిళలు రైతులు విద్యార్థులు యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే బీఆర్ఎస్ పార్టీ ఈ నిరసన కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

**మహిళలకు తీవ్ర అన్యాయం...**

కాంగ్రెస్ పాలనలో మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఇచ్చిన హామీలు అమలు కాక ఫీజుల బకాయిలు అందక ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో ఎలాగైనా ఓట్లు దండుకోవాలనే కుయుక్తులతో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క తదితర కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చినట్టుగా హామీలిచ్చారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన 420 హామీలు,6 గ్యారంటీలలో ఏ ఒక్కటి కూడా అమలు పర్చకుండా మహిళల సంక్షేమాన్ని విస్మరించారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు పిలుపు మేరకు కాంగ్రెస్ సర్కార్ 1000 రోజుల పాలనా వైఫల్యాలను ఎండగడుతూ తమ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 అందజేస్తామని వృద్ధాప్య వితంతు ఒంటరి మహిళల పింఛన్లను 2వేల నుంచి 4వేల రూపాయలకు పెంచుతామని కాలేజీకి వెళ్లే అమ్మాయిలకు స్కూటీలు బహూకరిస్తామని హామీలిచ్చి అమలు చేయడం లేదన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి రూ.1,00,116 చొప్పున ఉచితంగా అందజేసిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలతో పాటు తులం బంగారం అందజేస్తామన్న కాంగ్రెస్ నాయకుల వాగ్దానం నీటి మూటగానే మారిందని ఎంపీ వద్దిరాజు మండిపడ్డారు. కేబినెట్ లో ఉన్న బీసీ మంత్రిని రేవంత్ రెడ్డి తొలగించారని బీసీల రిజర్వేషన్లను 42శాతానికి పెంచి సంక్షేమానికి ఏటా 20వేల కోట్లు ఖర్చు చేస్తామన్న హామీ ఒట్టిదేనని తేలిపోయిందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మాతా శిశు సంక్షేమానికి "కేసీఆర్ కిట్" పేరిట తాతగా మేనమామగా అన్నగా 13వేల నగదుతో పాటు 20 రకాల అవసరమైన వస్తువులు ఉచితంగా అందజేసిన విషయాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.

**ఫీజు బకాయిలు విడుదలలో నిర్లక్ష్యం..**

విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో కాలేజీల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ మంజూరు చేయకపోవడంతో వాళ్లు చదువుకోలేకపోతున్నారని ఎంపీ రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. శిరీషా అనే గిరిజన ఆదివాసీ బిడ్డ అత్యాచారానికి గురై చంపబడితే ఆ కుటుంబాన్ని ఈ ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. ఆ కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టించి ఇవ్వాలని ఆమె అన్న శివరాంకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఎంపీ రవిచంద్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులకు పాలించడం చేతకావడం లేదని ప్రభుత్వ భూములను అమ్ముకోవడం దోచుకోవడం దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. రేవంత్ రెడ్డి, మంత్రులు ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారే తప్ప మహిళల సంక్షేమానికి అభ్యున్నతికి అక్కడ నుంచి ఒక్క రూపాయి కూడా తెలంగాణకు తేలేకపోతున్నారని ఎంపీ వద్దిరాజు నిశితంగా దుయ్యబట్టారు. రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరత గురించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శనంలో పార్లమెంటులో మాట్లాడి అవసరమైన మొత్తాన్ని సాధించడం జరిగిందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా మాట్లాడిన ఇతర రాష్ట్రాల ఎంపీలను అడ్డుకోవడంలో 8మంది కాంగ్రెస్ లోకసభ సభ్యులు ఎంఐఎం అసదుద్దీన్ ఓవైసీ విఫలమైన సందర్భాన్ని రవిచంద్ర ప్రస్తావించారు. ఇక్కడ నిషేధిత జాబితాలో పెట్టిన 444, 666, 817, 999, 727 సర్వే నంబర్లలోని భూములకు అందులో నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు. మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలు తిరిగి బీఆర్ఎస్ ను గెలిపించేందుకు కేసీఆర్ ను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సంసిద్ధులై ఉన్నారని ఎంపీ వద్దిరాజు వివరించారు. ఈ వంటావార్పు కార్యక్రమంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




# పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ


**ఆదిలాబాద్ మహా:** జిల్లాలో కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో 60 రోజుల ప్రత్యేక ఉచిత శిక్షణ అందించనున్నట్లు శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. 100 మంది చొప్పున ఎస్ఐ కానిస్టేబుల్ అభ్యర్థులకు మొత్తం 200 మందికి శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు.అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 05 నుంచి 11వ తేదీ వరకు బీసీ స్టడీ సర్కిల్, ఆదిలాబాద్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు.అభ్యర్థులు రూ.3 లక్షల ఆదాయ పరిమితికి సంబంధించిన ఇన్‌కమ్ సర్టిఫికెట్‌తో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, పోలీస్ ఉద్యోగానికి దరఖాస్తు చేసిన పత్రం సమర్పించాలన్నారు. అభ్యర్థులు పోలీస్ రిక్రూట్‌మెంట్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు. ఈనెల 05 నుండి 11వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈనెల 16 న మెరిట్ జాబితా వెలువరించి 17నుండి 18 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. ఈ నెల 19వ తేదీ నుండి శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. శిక్షణలో భాగంగా అభ్యర్థులకు ఉచిత పుస్తకాలు అందించడంతో పాటు, ప్రతిరోజూ నిపుణులైన అధ్యాపకులతో నాలుగు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారానికి ఒకసారి పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహించి అభ్యర్థుల ప్రతిభను అంచనా వేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 08732221280, 9949684959, 9494149416 నెంబర్లను సంప్రదించాలని అన్నారు.

## రాజీవ్ గృహకల్ప భవనాలు శిథిలావస్థకు చేరడంతో
# నివాసితులలో భయాందోళనలు

**రాజేంద్రనగర్ మహా ;** సామాన్యులకు సొంతింటి కల నెరవేరుస్తు గృహ నిర్మాణ శాఖ నిర్మించిన గృహకల్ప సముదాయాలు అప్పుడో, ఇప్పుడో అన్నట్లు కులేస్థితికి చేరాయి.గ్రేటర్ హైదరాబాద్ శంషాబాద్ పరిధిలోని రాల్లగూడ లో ఉన్న రాజీవ్ గృహకల్ప భవనాలు శిథిలావస్థకు చేరడంతో అందులో నివాసం ఉంటున్న మధ్యతరగతి, పేద కుటుంబాలు, బిక్కుబిక్కుమంటున్నాయి. 13 బ్లాక్ లో సుమారు వెయ్యికి పైగా ప్రజలు నివాసం ఉంటున్నారు.ఏ బ్లాక్ ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు మండిపడుతున్నారు. చిరు వ్యాపారుల కుటుంబాలు, వివిధ వృత్తుల వారు ఇక్కడ నివాసం ఉంటున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో శిధిలవస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు.

రాజీవ్ గృహ కల్ప భవనాలకు జిహెచ్ఎం సి ప్రధాన కార్యాలయం కూత వేటు దూరంలో ఉన్నా ఎక్కడ చెత్త అక్కడే ఉంది. చెత్త భారీగా పేరుకపోవడంతో దోమల బెడదతో అనారోగ్యాల బారీన పడుతున్నమని స్థానికులు వాపోతున్నారు.పేదల నివాసముంటున్న రాజీవ్ గృహకల్ప భవనాల దిక్కు జిహెచ్ఎంసి శానిటేషన్ చేయడంలేదు.





**ప్రతి బ్లాకులో పెచ్చులూడిన.. పగుళ్లు...**

ప్రతి బ్లాకు ల్లో గోడలు, మెట్లు, కారిడార్ లు, బాల్కనీలు, పెచ్చులూడిన పగుళ్ల తో,ఇనుము తేలింది. బెడ్ రూమ్లు, కిచెన్ లు, బాత్రూంల అధ్వానంగా తయారయ్యాయి. శానిటేషన్ చేయకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే కంపు కొడుతుంది. డ్రైనేజీకి సరైన పైప్ లైన్ లేకుండా పగిలి లీకేజీ తో మురుగునీరు గృహ సముదాయాల్లో నిలిచిపోయాయి. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు పేదల నివాసముంటున్న రాజీవ్ గృహాల వైపు దృష్టి సారించాలన్నారు.



**బాధితుల డిమాండ్**

శిథిలమైన ఇళ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. లేదా కొత్త ఇళ్లు నిర్మించి ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఎల్ నినో రావడంతో వర్షాలు తగ్గాయి. వర్షాలు భారీగా పడితే రాజీవ్ గృహాలు కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

# జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు

- ఆకట్టుకున్న చిన్నారుల వేష ధారణలు
- ఆలయాలలో భక్తుల సందడి
- ఉట్టి కొట్టి సంబరం
- భజనలు కీర్తనలతో శోభాయాత్ర
- ఇస్కాన్ ఆలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ పూజలు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ద్వాపర యుగంలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం శ్రీమహావిష్ణువు ఎనిమిదవ అవతారంగా శ్రీకృష్ణుడి రూపంలో జన్మించిన పవిత్రమైన రోజును పురస్కరించుకుని శ్రీకృష్ణాష్టమి వేడుకలను జరుపుకుంటారు. పట్టణంలోని ఇస్కాన్ ఆలయం, శ్రీరామచంద్రం గోపాల కృష్ణ మఠం, మురళీకృష్ణ ఆలయంతో పాటు పలు ప్రభుత్వ ప్రైవేట్ స్కూళ్లలోను వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాలలో చిన్నారులు రాధాకృష్ణులు, గొల్లభామల వేషధారణలో సందడి చేసారు. ఆలయాలలో ఉదయం నుండే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.భజనలు కీర్తనలతో ఆలయాల ప్రాంగణాలు భక్తి భావంతో మార్మోగిపోయాయి. పలు చోట్ల భజన నృత్యాలతో శోభాయాత్ర చేపట్టారు. ఇస్కాన్ ఆలయాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులందరికి ఆమె పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని పురాతన శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో మఠాధిపతి యోగానంద సరస్వతి నేతృత్వంలో వేకువజాము నుంచే ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుండే భక్తులు బారులు తీరి శ్రీకృష్ణుడిని ప్రత్యేక పూజలతో ఆరాధించి పలు ఉత్సవాల్లో పాల్గొన్నారు.శనివారం ఉట్టికట్టే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు నిర్వహాకులు తెలిపారు. అటు మురళీకృష్ణ ఆలయంలోను వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుందర చైతన్యానంద భక్తుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహంతో పల్లకీసేవ నిర్వహించారు.











## హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం

- ప్రజా సమస్యలపై కాంగ్రెస్‌ను నిలదీస్తాం
- ప్రజల ఇబ్బందులపై పోరాటం ఆపేది లేదు

**మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్:** క్యాతనపల్లిమహా : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ విమర్శించారు. 420 హామీల్లో ఒక్కదానినీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ఫ్రీ బస్ పథకం, జీఓ 76 అమలుపై అయన అసంతృప్తి వ్యక్తం చేశారు. క్యాతనపల్లిలో పెద్ద ఫ్యాక్టరీ, ఆసుపత్రి ఏర్పాటుపై ఇచ్చిన హామీలను మంత్రి వివేక్ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అధికారులు ప్రజలకు సేవ చేయాలని, పాలకవర్గంతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్ని కేసులు పెట్టినా ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తుల ఉమా మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, కేసీఆర్ కిట్ వంటి పథకాలను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకురాలు పద్మ, జిల్లా నాయకురాలు అత్తి సరోజ, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి, పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, నాయకులు, యువ నాయకులు పాల్గొన్నారు.





## భద్రాచలం దేవాలయం అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

- పనుల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి
- ముక్కోటి ఉత్సవాలలోపు ఉత్తర ద్వారా పనులు పూర్తి చేయాల్సిందే
- రెవెన్యూ సమాచారం శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- స్వామి వారి ఆలయం దర్శించుకున్న మంత్రి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** గోదావరి పుష్కరాల ప్రారంభం నాటికి అభివృద్ధి నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా చూడాలని రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. భద్రాద్రి జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పున నిర్మాణాలను చిత్రకూట మండపం పరిసరాలను గోశాల ప్రాంతాన్నీ అన్నదాన సత్రం విస్తా కాంప్లెక్స్ శివాలయానికి వెళ్లే మార్గం ఉత్తర ద్వార దర్శనం రామాలయంలో జరుగుతున్న పలు పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాంట్రాక్టర్స్‌ను, ఆర్కిటెక్చర్లను సకాలంలో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ఆదేశించారు. ఈ ఏడాది డిసెంబర్ నెలలో జరిగే ముక్కోటి ఉత్సవాలలోపు ఉత్తర ద్వారా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వచ్చే ఏడాది ఏప్రిల్ లో జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాలలోపు అన్ని పనులు పూర్తయ్యాలా చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి సూచించారు. అదేవిధంగా వచ్చే ఏడాది 2027 జూన్ జులై నెలలో జరిగే గోదావరి పుష్కరాల ప్రారంభంలోపు గోదావరి పరివాహక ప్రాంతంలో గల గోదావరి ఘాట్లు నిర్మాణాలు అభివృద్ధి పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రూ.276 కోట్ల నిధులు ఆలయ పరిసరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఎటువంటి నాణ్యతా లోపాలు లేకుండా దశాబ్దాల కాలం పాటు నిర్మాణాలు ప్రతిష్టంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. దక్షిణాయోధ్యగా పేరు గడించిన భద్రాచలం పుణ్య క్షేత్రం ఆలయ అభివృద్ధికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ ఏడాది జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాలలో పాల్గొని ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి వెంట జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణలతో పాటు భద్రాచలం ఐటీడీఏ పీ.ఓ రాహుల్, ఆలయ ఈఓ దామోదర్, తహసీల్దార్ రవి కుమార్, వివిధ శాఖల అధికారులు, ఆలయ ప్రతినిధులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ ప్రతిపక్షంగా విఫలం

**మణుగూరు, మహా:** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రెండోసారి అధికారంలోకి రావడం ఖాయమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మణుగూరులోని డీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు.బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా పూర్తిగా విఫలమైందని పాయం విమర్శించారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై మాట్లాడలేని కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వమే తెలంగాణను అప్పులపాలు చేసిందని పాయం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో సమస్యలు, నిధుల దుర్వినియోగం జరిగాయని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గతంలో వచ్చినన్ని స్థానాలు కూడా రావని అన్నారు.కవిత చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్, హరీశ్‌రావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని పాయం పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శ్రావణ మహాలక్ష్మి అలంకరణలో గాయత్రీ మాతా

**పంచాయతీ మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ చేసిన ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ ప్రేమ్ సుస్థిర దంపతులు**

**దమ్మపేట,మహా :** దమ్మపేట మండల కేంద్రంలో గల శ్రీ గాయత్రీ ఆశ్రమం నందు గాయత్రీ అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా భక్తులకు మనశ్శాంతి, జ్ఞానం, విద్య లభిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం ఉంది. శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా శ్రావణ 4 వ శుక్రవారము కావున గాయత్రీ అమ్మవారిని మట్టి గాజులతో శ్రావణ మహాలక్ష్మిగా అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దమ్మపేట పరిసర గ్రామాల నుండి వచ్చిన భక్తులతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గాయత్రీ ఆశ్రమ నిర్వాహకులు, ఆశ్రమ వ్యవస్థాపకులు ప్రేమ్ సుస్థిర గురూజీ, రమణి దంపతులు గాయత్రీ దేవి అమ్మవారి వాయనము చీర, తాంబులము, గాజులు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి ఇచ్చి మీరు, మీ కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని, ఆ జ్ఞానస్వరూపిణి మీ అందరికీ ఆయురారోగ్యాలను, సద్బుద్ధిని, ప్రశాంతతను ప్రసాదించాలని దీవించారు. ఈ సందర్భంగా ప్రేమ్ సుస్థిర గురూజీ మాట్లాడుతూ జ్ఞానానికి ప్రతీక అయిన గాయత్రీ దేవిని ఐశ్వర్య ప్రదాత అయిన మహాలక్ష్మి రూపంలో పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయి అన్నారు. ప్రతీ పండుగకు ఆశ్రమము నందు సామాజిక సేవా కార్యక్రమం నిర్వహిస్తూ సమాజ శ్రేయస్సుకు, పేదరిక నిర్మూలనకు మరియు మానవతా విలువలను పెంపొందించలని ఉద్దేశ్యంతో నేడు పంచాయతీ సిబ్బందిని ఆశ్రమంకు ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగింది అని, వారు నిరంతరం గ్రామ స్వచ్ఛతను పరిరక్షిస్తూ, పారిశుధ్య పనులను నిర్వహిస్తూ, మొక్కలను పెంచుతూ, ప్రజల వద్ద నుండి చెత్త సేకరిస్తూ గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బంది మెచ్చుకున్నారు.. ఈ సందర్భంగా ఆశ్రమంకు సహాయ సహకారాలు అందిస్తున్న సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి, పాలకవర్గ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సేవకులు, గాయత్రి పుత్రికలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం..

- మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌండ్ల నిరంజన్ గౌడ్..

**మొయినాబాద్ మహా:** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, మొయినాబాద్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌండ్ల నిరంజన్ గౌడ్ అన్నారు. శుక్రవారం నక్కలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను ఆయన పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు మంగళారం పద్మమ్మ ఇంటి నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన నిరంజన్ గౌడ్, ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటిని నాణ్యతా ప్రమాణాలతో పటిష్టంగా నిర్మించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు ఉన్నంతకాలం పేద ప్రజల హృదయాల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గుర్తుండిపోతుందని అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్



రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, గత ప్రభుత్వ అప్పుల భారం వంటి సవాళ్లు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల జారీ, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. పేద కుటుంబాలకు రేషన్ కార్డు, సన్నబియ్యం, సొంత ఇల్లు వంటి సంక్షేమ పథకాలు వారి జీవితాల్లో ఎంతో ఉపయోగపడుతున్నాయి. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నిరంజన్ గౌడ్ అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను కూడా నిలిపివేయకుండా, ప్రజలకు మరింత మెరుగైన సంక్షేమాన్ని అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ పేదల పక్షపాతి, నిజమైన ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని నిరంజన్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంగళారం నవీన్, విట్టల్, పెంటయ్య, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, పాల్గొన్నారు.



## హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం

మందమర్రి, మహా : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలోప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందనిభారత రాష్ట్ర సమితి నాయకులు బండారు సూరిబాబు, ఎండి అబ్బాస్, బత్తుల శ్రీనివాస్, మేడిపల్లి సంపత్ లు విమర్శించారు. శుక్రవారం మందమర్రి మార్కెట్ లోని బిఆర్ అంబేద్కర్ స్తూపం వద్ద భారత రాష్ట్ర సమితి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపుగా మూడు సంవత్సరాలు అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల పాలనలో మహిళలకు స్కూటీలు, వృద్ధులు, వికలాంగులకు పెన్షన్లు అందించకుండా మోసం చేస్తోందని వారు ఆరోపించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, వికలాంగుల సమస్యలను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకే ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు మహిళా నాయకురాలు పాల్గొన్నారు. అంతకుముందు పాలక ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని జోష్యం చెప్పారు.

## భగవద్గీత సందేశాలు నేటి సమాజానికి మార్గదర్శకం కావాలి

- మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి.


**రాజేంద్రనగర్ మహా :** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. కృష్ణాష్టమి వేడుకల్లోరాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, బిజెపి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.మంత్రులు ఇద్దరూ ఆలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం బిజెపి ఎంపీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రత్యేక పూజలు ని



ర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.మంత్రులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ప్రార్థించారు. శ్రీకృష్ణుడి జీవితం ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠకు ప్రతీక అని, భగవద్గీత సందేశాలు నేటి సమాజానికి మార్గదర్శకాలని మంత్రులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన నేటి సమాజంలో చాలామంది ఫలితం గురించి అతిగా ఆలోచించి ఒత్తిడికి, నిరాశకు గురవుతున్నారు. ఫలితాన్ని దేవునికి వదిలేసి, చేసే పనిపై పూర్తి శ్రద్ధ పెట్టాలని గీత బోధిస్తుంది. ఇది విద్యార్థులకు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరం ఉంటుందన్నారు. ప్రజలందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు సబ్‌డివిజన్‌లో.. ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**మణుగూరు, మహా:** శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా మణుగూరు సబ్‌డివిజన్ వ్యాప్తంగా శుక్రవారం భక్తి సందడి నెలకొంది. సుందరయ్యనగర్, పీవీ కాలనీ, రామానుజవరం తదితర ప్రాంతాల్లో భక్తులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా కృష్ణ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. చిన్నారుల కృష్ణుడి వేషధారణలు, యువత ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలకు జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.ఆలయ సమీపంలో నిర్మిస్తున్న కళ్యాణ



మండపం పనులను ఎమ్మెల్యే పరిశీలించి నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అర్చకులు, యువత, భక్తులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

సత్తుపల్లి, సెప్టెంబరు 4, మహా: మహిళలు ఎవరి మీదా ఆధారపడకుండా ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులుగా మారాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సత్తుపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఇందిర మహిళాశక్తి సదస్సులో కలెక్టర్ దివాకర టీఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. మహిళా సంఘాలు పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాలని సీతక్క సూచించారు. టిఫిన్ సెంటర్లు, క్యాంటీన్లు, డెయిరీ, పౌల్ట్రీ, సోలార్, కుట్టు యూనిట్లతో పాటు అటవీ ఉత్పత్తులతో విలువ ఆధారిత వ్యాపారాలు చేపట్టాలని కోరారు. వడ్డీలేని రుణాలతో పాటు లోన్ బీమా, ప్రమాద బీమా సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.కలెక్టర్ దివాకర మాట్లాడుతూ మహిళలు చిన్నస్థాయి నుంచి పెద్ద వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారని అన్నారు. ఖమ్మం జిల్లాలో మహిళల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు కావడం విశేషమన్నారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో 470 కొత్త మహిళా సంఘాలు ఏర్పడ్డాయని తెలిపారు.



## అక్రమంగా తరలిస్తున్న పశువులు స్వాధీనం..

- పోలీసులు అదుపులో నిందితులు...
- పశువులు తరలిస్తున్న వాహనాలు సీజ్..

**పెద్దపల్లి మహా, సెప్టెంబర్ 04, :** రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు,టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్/ నార్కోటిక్ టీమ్ సిబ్బంది అక్రమంగా పశువుల తరలింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు.మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో. పోలీసు బృందాలు తనిఖీలు నిర్వహించి కౌటాల నుంచి జగిత్యాల జిల్లా రాజారాంపల్లి మార్కెట్‌కు పశువులను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని మందమర్రి ప్రాంతంలో, టోల్ ప్లాజా వద్ద టాస్క్‌ఫోర్స్/నార్కోటిక్ టీమ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పశువులతో వెళ్తున్న 3 మహీంద్రా క్యాంపర్ వాహనాలను అడ్డుకుని తనిఖీ చేయగా,వాటిలో 13 ఆవులు,17 దూడలు కలిపి మొత్తం 30 పశువులు ఉన్నట్లు గుర్తించారు.ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు డ్రైవర్లు, నలుగురు సహాయకులు కలిపి మొత్తం ఏడుగురుని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి 3 మహీంద్రా క్యాంపర్ వాహనాలు,4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

**తాళ్లగురిజాల పోలీస్ స్టేషన్ పరిధిలో..**


అదేవిధంగా,బెజ్జూర్ గ్రామం నుంచి జగిత్యాల జిల్లా రాజారాంపల్లి మార్కెట్‌కు పశువులను అక్రమంగా తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ బృందం తాళ్లగురిజాల పోలీస్ స్టేషన్ పరిధిలోని తాళ్లగురిజాల గ్రామంలో తనిఖీలు నిర్వహించారు .ఈ సందర్భంగా పశువులతో వెళ్తున్న 2 మహీంద్రా క్యాంపర్ వాహనాలను అడ్డుకుని తనిఖీ చేయగా ,వాటిలో 20 ఆవులు,7 దూడలు కలిపి మొత్తం 27 పశువులు ఉన్నట్లు గుర్తించారు.ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు డ్రైవర్లను , ఇద్దరు సహాయకులు కలిపి మొత్తం నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి 2 మహీంద్రా క్యాంపర్ వాహనాలు,2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు వేర్వేరు ఘటనల్లో కలిపి 57 పశువులు,5 మహీంద్రా క్యాంపర్ వాహనాలు,6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మొత్తం 11 వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.పట్టుబడిన నిందితులను సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం , స్వాధీనం చేసుకున్న వాహనాలు,మొబైల్ ఫోన్లు మరియు పశువులను సంబంధిత పరిధిలోని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్ఓలకు అప్పగించారు..



## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**కుషాయిగూడ, మహా:** మల్కాజిగిరి లోని అష్టభుజా దేవి ఆలయం వద్ద యశోదా బాలగోకులం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నెల రోజులుగా ప్రతిరోజు నిర్వహించే శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈరోజు తో ముగియడంతో కృష్ణుడి వేషంలో పిల్లలు పెద్దలు స్థానికులు అందరూ పాల్గొన్నారు. యశోద బాలగోకులం ఆధ్వర్యంలో అష్టభుజాదేవి గుడి నుండి శ్రీకృష్ణుడి విగ్రహంతో ఊరేగింపుగా బయలుదేరి విష్ణుపురి మీదగా ఆనంద్ బాగ్ నుండి కానిస్టేబుజా దేవి గుడి వరకు ఊరేగింపు ఘనంగా సాగింది. శ్రీకృష్ణుడు రాధా వేషాలలో పిల్లలు అందరిని అలరించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ శ్రవణ్ విచ్చేశారు , కార్యక్రమంలో యశోద బాలగోకులం సభ్యులు విపిన్, దీపా వాసుదేవన్ , బాబు , కన్నన్ , దాసన్ , ఉమేష్ , రవి తదితరులు పాల్గొన్నారు.

# రూ.200 కోట్ల క్లబ్‌లో ‘ఇరుముడి’



రవితేజ నటించిన ‘ఇరుముడి’ బాక్సాఫీస్ వద్ద జోరు కొనసాగిస్తోంది. విడుదలై రెండు వారాలు పూర్తయ్యే సమయానికి ప్రపంచ వ్యాప్తంగా రూ.200 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం ప్రకటించింది. సాధారణంగా రెండో వారంలో సినిమాల కలెక్షన్లు తగ్గిపోతాయి. కానీ ‘ఇరుముడి’కి మాత్రం ప్రేక్షకుల ఆదరణ కొనసాగుతుండటం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రియ భవానీ శంకర్, బేబీ నక్షత్ర కీలక పాత్రల్లో నటించారు. కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్, తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో రూపొందిన సినిమాకు మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్ లభించింది. మౌత్ పబ్లిసిటీతో ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు క్యూ కడుతున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సెలవులు కూడా సినిమాకు కలిసొచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పెద్ద స్టార్ హీరోల సినిమాలు పోటీలో లేకపోవడం ‘ఇరుముడి’కి మరో ప్లస్‌గా మారింది. రాబోయే వీకెండ్‌తో పాటు వినాయక చవితి సెలవులు కూడా వసూళ్లకు దోహదపడే అవకాశం ఉంది. సెప్టెంబర్ 24న నాని నటించిన ‘ది పారడైజ్’ విడుదల కానుంది. అప్పటివరకు ఇదే జోరు కొనసాగితే ‘ఇరుముడి’ మరింత భారీ వసూళ్లు సాధించే అవకాశం ఉంది. ఇప్పటికే రూ.200 కోట్ల మార్క్ దాటిన ఈ సినిమా రూ.300 కోట్ల క్లబ్‌లోకి చేరుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

## కృష్ణుడి సోయగంలో అనసూయ



తెలుగు టెలివిజన్ యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ మరోసారి తన ప్రత్యేక లుక్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆమె చేసిన ప్రత్యేక ఫొటోషూట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సంప్రదాయ అందానికి దైవిక హంగులను జోడిస్తూ రూపొందించిన ఈ ఫొటోషూట్‌లో అనసూయ ఎంతో అందంగా కనిపించారు. వైబ్రెంట్ ఎరుపు రంగు చీరను ధరించిన ఆమె.. బంగారు డిజైన్లతో మరింత ఆకర్షణీయంగా మెరిశారు. చేతులు, పాదాలకు నీలిరంగు అలంకరణ చేసుకుని, వివిధ నృత్య భంగిమల్లో ఫొటోలకు పోజులిచ్చారు. ఈ లుక్ రాధాకృష్ణుల ప్రేమను, శ్రీకృష్ణుడి చిలిపితనాన్ని గుర్తుచేసేలా ఉందంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా అనసూయ ఎంచుకున్న ఈ కాన్సెప్ట్ ప్రత్యేకంగా నిలిచింది. యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన అనసూయ ‘జబర్దస్త్’ కామెడీ షో ద్వారా తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం సినిమాల్లోకి అడుగుపెట్టి నటిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్నారు. 2016లో వచ్చిన ‘క్షణం’ చిత్రంలో ఏసీపీ జయ భరద్వాజ్ పాత్రలో నటించి ప్రశంసలు అందుకున్నారు. అదే ఏడాది ‘సోగ్గాడే చిన్ని నాయనా’ చిత్రంలో ప్రత్యేక పాత్రలో కనిపించారు. 2018లో విడుదలైన ‘రంగస్థలం’లో కొల్లి రంగమ్మగా అనసూయ పోషించిన పాత్ర ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. ఆ తర్వాత ‘పుష్ప: ది రైజ్’లో దాక్షాయణిగా, ‘పుష్ప 2: ది రూల్’లోనూ తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ నటిగా తన పరిధిని విస్తరించుకుంటున్నారు. ప్రస్తుతం ‘నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్’లో లీలావతిగా నటిస్తున్నారు. అలాగే ‘హరి హర వీరమల్లు’, ‘అరి: మై నేమ్ ఈజ్ నోబడీ’, తమిళ చిత్రం ‘వుల్ఫ్’ వంటి ప్రాజెక్టుల్లోనూ భాగమయ్యారు. ఈ నేపథ్యంలో శ్రీకృష్ణాష్టమి ప్రత్యేక ఫొటోషూట్‌తో అనసూయ మరోసారి తన గ్లామర్‌తో పాటు సంప్రదాయ శైలిని కూడా అద్భుతంగా ఆవిష్కరించారు.

## చదువుపై కరీనా కపూర్ ఆసక్తికర వ్యాఖ్యలు



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ తన చదువు గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. ఇంటర్ ఫస్ట్ ఇయర్ తర్వాత చదువును కొనసాగించలేదని తెలిపారు. సినిమాల్లోకి రావాలనే కోరికతో చిన్న వయసులోనే చదువుకు స్వస్తి పలికానని చెప్పారు. ఆ సమయంలో తన మనసు చెప్పిన మాట విని నటన వైపు అడుగులు వేశానని, అయితే చదువును పూర్తి చేయలేకపోయాననే అసంతృప్తి ఇప్పటికీ తనలో ఉందని పేర్కొన్నారు. ఈ అనుభవం కారణంగానే తన ఇద్దరు కుమారులు తైమూర్, జెహ్ చదువు విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉంటున్నట్లు తెలిపారు. ముందుగా విద్యను పూర్తి చేసి, ఆ తర్వాత వారికి నచ్చిన రంగంలోకి వెళ్లాలని పిల్లలకు చెబుతున్నానన్నారు. కరీనా 2014 నుంచి యూనిసెఫ్ ఇండియాతో కలిసి పిల్లల విద్య, బాలికల విద్య, లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమాల్లో భాగమవుతున్నారు. ఇక 2000లో ‘రెఫ్యూజీ’ సినిమాతో హీరోయిన్‌గా బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన కరీనా.. ఆ తర్వాత ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. అయితే చదువును మధ్యలోనే ఆపేయడం తన జీవితంలో అసంపూర్తి అధ్యాయంగానే మిగిలిందని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.



## పంజాబీ గాయకుడు బల్జీత్ సింగ్ మృతి

పంజాబీ సంగీత పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ గాయకుడు, గేయరచయిత బల్జీత్ సింగ్ (35) లూధియానాలోని తన నివాసంలో మృతిచెందారు. సెప్టెంబర్ 3న ఆయన ఇంటి నుంచి తీవ్రమైన దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా.. మంచంపై బల్జీత్ సింగ్ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. ఆయన మృతి నాలుగైదు రోజుల క్రితమే జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానించారు. ఇంట్లోని కొన్ని ప్రాంతాల్లో రక్తపు మరకలు కనిపించడంతో ఈ ఘటనపై తొలుత అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో పోలీసులు ఫోరెన్సిక్ నిపుణులు, డాగ్ స్క్వాడ్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్ బృందాలను రంగంలోకి దించారు. సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించడంతో పాటు పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. బల్జీత్ సింగ్ చివరిగా ఎవరిని కలిశారు, ఎవరితో మాట్లాడారు అనే విషయాలపైనా ఆరా తీశారు.అయితే దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో పోస్ట్‌మార్టం నివేదిక కీలక విషయాన్ని వెల్లడించింది. బల్జీత్ సింగ్ గుండెపోటుతోనే మృతిచెందినట్లు నివేదికలో తేలిందని సుధార్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కుల్విందర్ సింగ్ తెలిపారు. ప్రాథమిక దర్యాప్తులో ఎలాంటి నేరపూరిత చర్యకు సంబంధించిన ఆధారాలు లభించలేదని, ఫౌల్ ప్లేను కూడా తోసిపుచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. దీంతో తొలుత నెలకొన్న అనుమానాలకు పోస్ట్‌మార్టం నివేదికతో కొంతవరకు తెరపడింది.బల్జీత్ సింగ్ తల్లిదండ్రులు మరణించిన తర్వాత ఒంటరిగానే జీవిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో ఆయనపై డ్రగ్స్‌కు సంబంధించిన కేసు ఉన్నప్పటికీ, ఆయన డ్రగ్స్‌కు బానిస అని చెప్పేందుకు ఆధారాలు లేవని స్పష్టం చేశారు. గాయకుడిగా, గేయరచయితగా పంజాబీ సంగీత రంగంలో బల్జీత్ సింగ్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ‘పైసా బోల్దా’, ‘మేరే సర్దార్ జీ’, ‘కాళీ రాత్’ వంటి పాటలతో పాటు పలు భక్తి గీతాలతోనూ శ్రోతలను ఆకట్టుకున్నారు. ఆయన ఆకస్మిక మృతితో పంజాబీ సంగీత వర్గాల్లో విషాదం నెలకొంది. ఇంట్లో రక్తపు మరకలు ఎలా వచ్చాయన్న అంశంపై దర్యాప్తు కొనసాగుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com